తెలంగాణ జాతీయ దినపత్రిక

# ప్రజా మంటలు

సంపుటి : 4
సంచిక : 35
పేజీలు - 8
వెల- రూ 5:00
prajamantalu.com

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

మంగళవారం 27, జూన్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## ఓవర్‌లోడ్‌తో పశువులను తరలిస్తున్న వాహనాలు సీజ్



ధర్మపురి జూన్ 26 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని రాయపట్నం చెక్ పోస్ట్ వద్ద సామర్థ్యంకు మించి పశువుల(ఎడ్లు)ను తరలిస్తున్న మూడు డీసీఎం వాహనాలను పట్టుకొని ధర్మపురి పోలీసులు సీజ్ చేశారు. వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం తనిఖీ నిర్వహిస్తుండగా కౌటల నుండి ఒక వాహనం చిల్వకొడురుకు, మరో రెండు వాహనాలు రంగా రెడ్డి జిల్లాకు తరలి స్తున్న మొత్తం మూడు వాహనాలను సీజ్ చేసి, ఆ వాహనాల లోని 56పశువుల(ఎడ్లు)ను వెటర్నరీ డాక్టర్ సమక్షంలో విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ ఐ పి. దత్తాత్రి తెలిపారు.

### తెలంగాణ రాష్ట్రం పథకాలు

## దేశానికే స్ఫూర్తి

### -వినోద్ కుమార్



హైదరాబాద జూన్ 26 (ప్రజా మంటలు) : సరికొత్త రికార్డులతో తెలంగాణ రాష్ట్రం దేశ ప్రజలను ఆకర్షిస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సారథ్యంలో ప్రారంభించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. జాతీయ సామాజిక శాస్త్రాల అధ్యయన

మిగతా 2లో..

## దివంగత మంత్రి జువ్వాడి సతీమణికి ఘన నివాళులు



ధర్మపురి జూన్ 26(ప్రజా మంటలు) : కరీంనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, దివంగత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు సతీమణి జువ్వాడి సుమతి ఈనెల 15 న అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించగా, జువ్వాడి స్వగ్రామం తిమ్మాపూర్ గ్రామంలో ఆమె ద్వాదశ దినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఆనంతరం ధర్మపురి పట్టణం లోని లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో వేలాది మంది ఘనంగా నివాళులర్పించారు. ప్రధానంగా మహారాష్ట్ర మాజీ గవర్నర్, మాజీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు చెన్నమనేని విద్యాసాగర్ రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాడిపత్రి జీవన్ రెడ్డి, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాం మోహన్ రావు, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, శ్రీహరి రావు, గిరి నాగ భూషణం, పలువురు నేతలు, అభిమానులు ఈసందర్భంగా సుమతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆమె కుమారులు కాంగ్రెస్ నాయకులు, ఏపీ ఐ ఐ సి మాజీ డైరెక్టర్ జువ్వాడి నర్సింగరావు, ధర్మపురి దేవస్థానం మాజీ చైర్మన్ జువ్వాడి నవనీత కృష్ణారావు, చంద్ర శేఖర్ రావు లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆగస్టు మొదటి వారంలో కాంగ్రెస్‌లో బిజేపి నాయకుల చేరిక..?

- ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తుల ఉమ, ఏనుగు రవీందర్ రెడ్డి..?
- వీరి చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాహుల్ గాంధీ...
- ఢిల్లీలో రేవంత్ రెడ్డితో చర్చించిన సునిల్ కనుగోలూ ..



**తెలంగాణలో భారాస తో ఒకసారి మైత్రి, ఒకసారి పోరుబాట అనే తీరులో ఎటు తేల్చుకోలేని బిజేపి కేంద్ర నాయకత్వ తీరును స్థానిక నాయకులు జీర్ణించుకో లేకపోతున్నారు. ఈ నేపథ్యంలో, ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తుల ఉమ, ఏనుగు రవీందర్ రెడ్డి లు ఆగస్టు మొదటి వారంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. వీరి చేరికకు రాహుల్ గాంధీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు, వీరి విషయంలో, ఢిల్లీలో రేవంత్ రెడ్డితో, సునిల్ కనుగోలూ చర్చించినట్లు తెలుస్తుంది. ఈటల ఎన్నిసార్లు పార్టీ వీడనని చెప్పినా, కాంగ్రెస్ లో చేరుతాడానే ప్రచారం మాత్రం ఆగడం లేదు.**

న్యూఢిల్లీజూన్26 (ప్రజా మంటలు బ్యూరో) : తెలంగాణలో భారాస తో పోరాడే నేపథ్యంలో, బిజేపిలో నెలకొన్న అయోమయ పరిస్థితులలో పలువురు బిజేపి నాయకులు కాంగ్రెస్ లో చేరిపోవడానికి సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. గత కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న బిజేపి నాయకులు, పార్టీ వ్యవహరిస్తున్న తీరుతో విసుగు చెంది వున్నట్లు వార్తలు వస్తున్నాయి. తెలంగాణలో భారాస తో ఒకసారి మైత్రి, ఒకసారి పోరుబాట అనే తీరులో ఎటు తేల్చుకోలేని బిజేపి కేంద్ర నాయకత్వ తీరును స్థానిక నాయకులు జీర్ణించుకో లేకపోతున్నారు. ఈ నేపథ్యంలో, ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తుల ఉమ, ఏనుగు రవీందర్ రెడ్డి లు ఆగస్టు మొదటి వారంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. వీరి చేరికకు రాహుల్ గాంధీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు, వీరి విషయంలో, ఢిల్లీలో రేవంత్ రెడ్డితో, సునిల్ కనుగోలూ చర్చించినట్లు తెలుస్తుంది. ఈటల ఎన్నిసార్లు పార్టీ వీడనని చెప్పినా, కాంగ్రెస్ లో చేరుతాడానే ప్రచారం మాత్రం ఆగడం లేదు. వీరి చేరిక విషయంలో సునీల్ కొనుగోలు రాజీవ్ గాంధీ, రేవంత్ రెడ్డిలతో చర్చించినట్లు,వారు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. బిజేపిలో గత రెండు సంవత్సరాల కాలంలో చేరిన ఇతర పార్టీ నాయకులు ముఖ్యంగా, భారాస నుండి వచ్చిన వారి పట్ల పూర్వ బిజేపి నాయకులు, ఆర్ ఎస్ ఎస్ నేపథ్యం ఉన్న వారు వ్యవహరిసున్న తీరుపట్ల వీరు కినుకు వహించారు. పార్టీని బలోపేతం చేసి, భారాసకు పోటీగా తెలంగనాలో రెండవ స్థానానికి తెచ్చిన వారికి తగిన గుర్తింపులేదనే వాదన ఎన్నాళ్లుగానో వినబడుతుంది. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ దుకుడుతో పార్టీకి కొత్త ఊపు వచ్చినా, కొత్తగా చేరిన వారికి తగిన ప్రాహదాన్యత ఇవ్వకపోవడం, కర్ణాటకలో కాంగ్రెస్ విజయంతో, తెలంగాణలో బిజేపి నాయకులలో నిరాశ, నిర్లిప్తత పెరిగిపోయినట్లు కనబడుతుంది. ఇటీవల ఏతల, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అమిత షా ను కలిసినపుడు తెలంగాణలోని పార్టీ పరిస్థితిని విషాదీకరించినట్లు, భారాస తో పోరులో బిజేపి వెనుకబడిపోతుందని, కేంద్ర నాయకత్వ తీరును అర్థం చేసుకోలేక పోతున్నట్లు స్పష్టంగా తెలిపినట్లు తెలుస్తుంది. స్థానిక రాజకీయాలలో రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కు చెరికాల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ కు మధ్య సయ్యవధ్య లేకపోవడం, పార్టీలో చేరాలనుకొనే వారికి ఎలాంటి హామీలు ఇవ్వలేకపోవడం, కొత్తవారిని పార్టీలో చేర్చుకొంటే వారికి ఇచ్చే ప్రాధాన్యత విషయంలో ఏర్పడ్డ అయోమయంతో, ఎవరిని బజపలోకి ఆహ్వానించలేకపోయారు. అదీకాకా పార్టీలో చేరాలను కొనే వారు కూడా కాంగ్రెస్ లో చేరడంతో నీరుగారైపోయిన ఈటల బృందం పార్టీ విడిపోవాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. బిజేపిలో

## మహారాష్ట్రలో కెసిఆర్‌కు ఘన స్వాగతం



# నడ్డా..ఇది కెసిఆర్ అడ్డా

- నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి
- కేంద్ర సాయంపై తప్పుడు లెక్కలెందుకు
- మండిపడ్డ మంత్రి ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్,జూన్26 : నాగర్ కర్నూల్ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాచేసిన అసత్య ఆరోపణలపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నడ్డా.. ఇది కేసీఆర్ అడ్డా.. ముఖ్యమంత్రి గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు కేంద్రం ఇచ్చిన గణాంకాలు నయా పైసాతో సహా వివరించినప్పటికీ.. కుక్కతోక వంకర అన్నట్లు పదేపదే అవే పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. వచ్చిన ప్రతిసారీ తెలంగాణ అభివృద్ధిపై విషంచిమ్మే మాటలే చెబుతున్నారని, గుజరాత్ గులాంలైన ఇక్కడి బీజేపీ నాయకులు రాసిచ్చిన పాత స్క్రిప్ట్‌నే ఎన్ని సార్లు చదువుతారని నిలదీశారు. బుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో అవినీతి జరిగిందనడానికి సిగ్గుండాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్మిస్తున్న ఇండ్లకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు పైసలు ఇవ్వనప్పటికీ.. అవార్డులు ఇస్తుందని తెలుసా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం కోసం రూ.12వేల కోట్లు ఖర్చు పెడితే.. కేంద్రం ఇచ్చింది రూ.1200 కోట్లు మాత్రమేనని తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా పట్టణ ప్రాంతాలలో నిర్మిస్తున్న 1,59,372 ఇండ్లకు, ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షల చొప్పున రూ.2,390 కోట్లు ఆర్థికసాయం చేస్తామని చెప్పినప్పటికీ.. రూ.1,201 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. అంటే ఇండ్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ఖర్చుచేసిన డబ్బులో ఇది కేవలం 10 శాతం

మిగతా 2లో..

## కాంగ్రెస్ లోకి రాహుల్ సమక్షంలో పొంగులేటి,జూపల్లి



### జులై 2 న ఖమ్మంలో బహిరంగ సభ

న్యూఢిల్లీ జూన్ 26 (ప్రజా మంటలు బ్యూరో) : జులై 2, ఆదివారం, రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. జులై 2న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ వేదికగా కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం రాహుల్ గాంధీతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావుతోపాటు తెలంగాణకు చెందిన 35 మంది నేతలు భేటీ అయ్యారు. ఏఐసీసీ కార్యాలయంలో అరగంటకు పైగా సమావేశం సాగింది. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ..

మిగతా 2లో..

## ప్రజానాడి





## టమాటా ధరల మోత



మిగతా 2లో..

# కేసీఆర్‌తో పెట్టుకున్న వారెవరూ బాగపడలేదు

- అభివృద్ధిని ఓర్వేకపోతున్నారని ఎద్దేవా
- నడ్డా విమర్శలపై మండిపడ్డ మంత్రి కెటిఆర్
- ఉప్పల్ స్కైవాక్‌ను ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్,జూన్26 : కెసిఆర్‌తో పెట్టుకున్న ఏ నాయకుడు బాగుపడిన దాఖలాలు లేవని బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు మంత్రి కెటిఆర్ పరోక్షంగా హెచ్చరిక చేశారు. తెలంగాణ పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నాగర్ కర్నూల్ సభలో పాల్గొనేందుకు వచ్చిన నడ్డా ఆ సందర్భంగా ఇష్టారీతిన మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జైల్లో పెడతామని, ధరణి వ్యవస్థను తీసేస్తామని చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. గత కొన్నేళ్లలో కేసీఆర్‌తో పెట్టుకున్న ఏ నాయకుడు బాగుపడినట్లు లేదని తేల్చి చెప్పారు. సోమవారం ఉప్పల్ కూడలిలో నిర్మించిన స్కై వాక్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. సీఎం కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. గతంలో కరెంట్ ఉంటే వార్తలాగా ఉండేదని, ఇప్పుడు కరెంట్ పోతే వార్త లాగా ఉందన్నారు. విపక్షాలు అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నాయని, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అడ్డమైన మాటలు మాట్లాడి వెళ్లారని, సిఎం కెసిఆర్‌ను తిట్టి పైశాచికానందం పొందుతున్నారని కెటిఆర్ దుయ్యబట్టారు. ఉప్పల్ ... కట్టలేదో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పాలని

మిగతా 2లో..



# మహారాష్ట్రలో కెసిఆర్‌కు ఘన స్వాగతం





## తెలుగు వారితో పాటు స్థానిక ప్రజల నీరాజనం

దారాశిర (మహారాష్ట్ర) జూన్ 26 (ప్రజా మంటలు) : మహారాష్ట్రలోని ధారాశివ్, సోలాపూర్ జిల్లాల్లో బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఅర్ పర్యటన. రెండు రోజుల పాట సాగనున్న ఈ పర్యటనలో భాగంగా మహారాష్ట్రలోని ధారాశివ్, సోలాపూర్ జిల్లాల్లో సీఎం పర్యటించారు. ధారాశివ్ కు చేరుకున్న సీఎం కేసీఆర్ గారికి అక్కడి స్థానిక నాయకులు, మహిళలు సాంప్రదాయ రీతిలో హారతినిచ్చి, స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ సోలాపూర్ కు బయలుదేరారు. ఆ సమయంలో జోరు వాన కురుస్తున్నా లెక్కచేయకుండా సీఎం కాన్వాయ్ ముం దుకు సాగింది. సోలాపూర్ కు చేరుకున్న బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారికి స్థానిక నాయకులు, శ్రేణులు గొప్పగా స్వాగతం పలికాయి. కేసీఆర్‌పై గులాబీ పూల వర్షం కురిపించాయి. కేసీఆర్ గారిని చూసేందుకు ప్రజలు గుమిగూడారు. మొబైల్ లతో ఫోటోలు తీసుకున్నారు. కేసీఆర్ గారితో చేయి కలిపేందుకు ప్రజలు, నాయకులు దూసుకొచ్చారు. సీఎం కేసీఆర్ గారిని స్వాగతిస్తూ డప్పు దరువులతో ఆ ప్రాంతమంతా మారు మోగింది. స్థానిక నేతలు భారీ గజమాలతో కేసీఆర్ గారిని సత్కరించారు. 'దేశ్ కి నేత కేసీఆర్' నినాదాలతో హోరెత్తించారు. 'అబ్ కి బార్ కిసాన్ సర్కార్' నినాదాలు మిన్నంటాయి. సోలాపూర్ ప్రజల అపూర్వ స్వాగతం మధ్య సీఎం కేసీఆర్ గారు బాలాజీ సరోవర్ హోటల్ కు చేరుకొని కాసేపు సేదతీరారు. అనంతరం సీఎం కేసీఆర్ గారు హోటల్ నుండి బిఆర్ఎస్ నాయకుడు ధర్మన్న ముండయ్య సాదుల్ ఆహ్వానం మేరకు, సోలాపూర్ భావనారుషి పేట్ లోని వారి ఇంటికి వెళ్ళి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ధర్మన్న సాదుల్ ఒక పర్యాయం మేయర్ గా, రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ తరఫున సోలాపూర్ నియోజకవర్గ ఎంపీగా సేవలు అందించారు. ఈ సందర్భంగా ధర్మన్న సాదుల్ తన కుటుంబ సభ్యులను సీఎం గారికి పరిచయం చేశారు. కేసీఆర్ గారు ధర్మన్న సాదుల్ తో సమకాలీన రాజకీయ పరిస్థితుల పై చర్చించారు. అనంతరం సీఎం కేసీఆర్ గారు రాత్రి బస నిమిత్తం బాలాజీ సరోవర్ హోటల్ కు తిరిగి చేరుకున్నారు. ధర్మన్న సాదుల్ గృహానికి చేరుకున్న ముఖ్యమంత్రి గారికి అక్కడే స్థిరపడిన తెలంగాణ ప్రజలు దారి పొడవునా తెలుగులో మాట్లాడుకుంటూ స్వాగతం పలుకుతూ, ఆనంద హర్షాతిరేకాలు వ్యక్తం చేయడం ఆకట్టుకున్నది. పద్మశాలీలు ఎక్కువగా స్థిరపడ్డ సోలాపూర్ లోని ఈ ప్రాంతంలోనే బిఆర్ఎస్ నాయకుడు ధర్మన్న సాదుల్ నివాసం కూడా ఉన్నది. ధర్మన్న సాదుల్ తెలంగాణకు చెందిన పేద పద్మశాలి కుటుంబంలో జన్మించారు. కరీంనగర్ జిల్లా కన్నాపూర్ గ్రామ వాస్తవ్యులైన వీరి పూర్వీకులు ఉపాధి కోసం సోలాపూర్ కు వచ్చి స్థిరపడ్డారు. ధర్మన్న సాదుల్ కాల క్రమంలో ప్రజా నాయకునిగా పలు పదవుల్లో రాణించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ ఆదర్శాలకు, విధానాలకు ఆకర్షితులై ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు గారి పాలనను మహారాష్ట్ర ప్రజలకు కూడా అందించాలని లక్ష్యంతో వారు ఇటీవలే సీఎం కేసీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, జగదీశ్వర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రా రెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్‌బీ బిఆర్ఎస్ సెక్రటరీ జనరల్, రాజ్యసభ సభ్యులు కె.కేశవ రావు, ఎంపి లు నామా నాగేశ్వర్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ , ఇతర ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## విసిలతో గవర్నర్ తమిళిసై సమావేశం..!

హైదరాబాద్ జూన్ 26 (ప్రజా మంటలు) : రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సమావేశమ య్యారు. రాజ్‌భవన్‌లో ఈ సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ వైస్ చాన్సలర్లతో పాటు యుజిసి అధికారులను మాత్రమే పిలిచినట్టుగా తెలుస్తోంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు గవర్నర్ నుంచి ఆహ్వానం అందలేదని సమాచారం. ఇక, ఈ సమావేశం సందర్భంగా గవర్నర్ తమిళిసై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల అభివృద్దే ప్రధాన లక్ష్యమని చెప్పారు. దేశాభివృద్ధికి ఉన్న విద్య అనేది ఒక పిల్లర్ అని అన్నారు. రాజ్‌భవన్‌లో డిజిటల్ లైబ్రరీలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఉన్న సమస్యలతో విద్యార్థులతో ఇంటరాక్ట్ కాలేకపోతున్నానన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై ఆరా తీశారు. విద్యార్థులు ఆత్మహత్యలపై అంతా ఆలోచించాలన్నారు. మంచి ప్రొఫెసర్లు, ట్యాలెంటెడ్ స్టూడెంట్స్ ఉన్నా ర్యాకింగ్స్‌లో వెనకబడుతున్నామని అన్నారు. విద్యార్థులను జాబ్ సీకర్స్‌గా కాకుండా జాబ్ క్రియేటర్స్‌గా యూనివర్సిటీలు తీర్చిదిద్దాలని చెప్పారు. ఇది ఓపెన్ మీటింగ్ అని ఏ విషయమైనా తనతో చెప్పొచ్చన్నారు.

## నడ్డా..ఇది కెసిఆర్ అడ్డా

మాత్రమేనని తేల్చిచెప్పారు. హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కోక్క ఇంటిని రూ.8,65,000 వ్యయంతో నిర్మిస్తుండగా పీఎంఏవై ద్వారా రూ.1.50 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకూ సగం నిధులు మాత్రమే విడుదల చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తెలంగాణ డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకాన్ని ప్రశంసిస్తూ.. ÷-రధాన మంత్రి అవార్డు, హడ్కో ఎక్సలెన్స్ 2018, హడ్కో ఎక్స లెన్స్ 2019, నిర్మాణాల్లో నూతన టెక్నాలజీ ఉపయోగించినందుకు ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణకు 2020 సంవత్సరానికిగాను కేంద్ర గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖ ఎక్సలెన్స్ అవార్డు.. ఇలా పలు అవార్డులు, పురస్కారాలు అందజేశారని గుర్తుచేశారు. తెలంగాణలో జాతీయ రహదారుల కోసం మోదీ ప్రభుత్వం కాగితాల మీద రూ.1.21 లక్షల కోట్లు మంజూరు చేసి తొమ్మిదేండ్లలో ఖర్చు చేసింది మాత్రం రూ.19 వేల కోట్లేనని విమర్శించారు. అవి కూడా రాష్ట్ర ప్రజల నుంచి టోల్‌ట్యాక్స్, సెస్‌ల ద్వారా ముక్కు పిండి వసూలు చేసిన పైసలేనని స్పష్టం చేశారు. కాగితాల మీద మంజూరి లెక్కలు చెప్పి తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ నేతలు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధును కాపీ కొట్టి పెట్టిన కేంద్రం.. కిసాన్ సమ్మాన్ నిధిలో రైతులకు కండీషన్లు పెట్టి రైతుల సంఖ్యను తగ్గించడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో రైతుబంధు పథకం ప్రారంభించినప్పుడు 49 లక్షల మంది రైతులు ఉండగా, నేడు లబ్దిదారుల సంఖ్య 70 లక్షలకు చేరిందని తెలిపారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వమన్నారు. కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 29 లక్షల మంది రైతులకు ఇప్పటివరకు రూ.9 వేల కోట్లు ఖర్చు చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం 70 లక్షల మంది రైతులకు ఈ సీజన్ వరకు రూ.72 వేల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. రైతుల పట్ల ఎవరి చిత్తశుద్ధి ఏంటో రాష్ట్ర, కేంద్ర గణాంకాలు చూస్తే అర్థమవుతుందన్నారు.

## ఆగస్టు మొదటి వారంలో కాంగ్రెస్‌లో బిజేపి నాయకుల చేరిక..?

(మొదటిపేజీ తరువాయి)



చేరాలని ఖమ్మం లోని భారాస బహిష్కృత నేత పొంగులేటి, మహబూబ్ నగర్ నేత జూపల్లి ప్రయత్నించినా, బిజేపి లోని పరిస్థితులు అర్థం కాకుండా, ఉన్న వారే హ్యూమిలిఏట అవుతు న్నారని భావించి, కాంగ్రెస్ వైపు వెళ్ళడం తో ఈటల వర్గం పూర్తిగా నిరాశపడిపోయింది. అలాగే, భారాసలోని అసంతృప్త నేతలు, రేపు తిక్కట్టు రాదనుకొనే వారు కూడా ముందుగా బిజేపి లో చేరుతారనే ప్రచారం భారీగానే జరిగినది. బిజేపి కి వచ్చిన ఊపు చూసి, కాంగ్రెస్ పార్టీ కొంత నిరుత్సాహ పడినా, బిజేపి లోని అంతర్గత కు మ్ములాటలతో, కర్ణాటక లో కాంగ్రెస్ విజయంతో మళ్ళీ ఊపం దుకొన్న కాంగ్రెస్ లోకి పొంగులేటి, జూపల్లి చేరుతున్నారనే వార్తల తో మరింత బాలపడే సూచనాలున్నాయి. ఈ నేపథ్యంలో బిజేపి లోని అసంతృప్త నేతలు కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ లోకి రాహుల్ సమక్షంలో పొంగులేటి,జూపల్లి

తెలంగాణ వస్తే మంచి జరుగుతుందని సోనియా ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారనితెలిపారు.ప్రత్యేకరాష్ట్రాన్నిసాధించినా అనుకున్నది జరగలే దని, నీళ్లు, నిధులు, నియామకాలు ఏమయ్యాయని ప్రశ్నిం చారు. తెలంగాణబిడ్డలుఆత్మగౌరవాన్నికోల్పోతున్నారనిఆవదేనవ్యక్తం చేశారు.

## అందరితో చర్చించే నిర్ణయం: పొంగులేటి

బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక జూపల్లిలో కలిసి అనేక సభలు సమావేశాలు నిర్వహించి,ప్రజలుఏంకోరకున్నారనే విషయాలు తెలు సుకున్నామని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీ పెట్టేకంటే కూడా ప్రభు త్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా చూడాలనే ప్రతిపాదన వచ్చిందని తెలి పారు.సర్వేల్లోప్రజలకుబీఆర్ఎకువ్యతిరేకంగా ఉన్నారని తేలిం దన్నా రు. అందరితోచర్చించికాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకు న్నట్లు వెల్ల డించారు.తనకు పదవులివ్వలేదనిపార్టీమారడంలేదనిస్పష్టం చేశారు.

## పాతాళానికి కేసీఆర్ పాలన: జూపల్లి

ప్రత్యేక తెలంగాణ లక్షలాది మంది యువకుల కల అని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం జరిగినట్లే పాల న ఉందనుకున్నామని, కానీ కేసీఆర్ పాలన పాతాళానికి పోయిందని విమర్శించారు. సీఎం కేసీఆర్‌వి అన్నీ మభ్యపెట్టే మాటలేనని దుయ్య బట్టారు. ఏ స్కీం పెట్టాలి, ఎలా గెలవాలన్నది కేసీఆర్ వ్యూహమేనని.. స్కీంల వెనక ఎంతపెద్ద అవినీతి ఉందో తవ్వేకొద్ది తెలుస్తోందని అన్నా రు.మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కేసీఆర్ మనుషులుగా కూడా గౌరవించలేదని మండిపడ్డారు. ఎన్నికలకు ఇంకా నాలుగు నెలలే ఉంది కాబట్టి అంబేద్కర్ పేరు జపిస్తున్నారని. మూడోసారి రాష్ట్ర ప్రజలను పాలించే హక్కు కేసీఆర్ కోల్పోయారని అన్నారు. మరోసారి తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకూడదని పేర్కొన్నారు.

# టమాటా ధరల మోత

- వందకు చేరువలో ధరలు
- వర్షాలు ఆలస్యం కావడంతో పెరుగుతున్న రేట్లు



హైదరాబాద్,జూన్26 : టమోటా ధరలు మోత మోగిస్తున్నాయి. వేసవిలోనూ తక్కువ ధరకు అందుబాటులో ఉన్న టమోటాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా అత్యధిక మార్కెట్లలో కిలో రూ.100 పలుకుతున్నది. హోల్ సేల్ మార్కెట్లలో రూ.65-70 మధ్య లభిస్తున్నాయి. వారం క్రితం వరకు హోల్ సేల్ మార్కెట్లో రూ.30-35 మధ్య పలికిన టమోటా రిటైల్ మార్కెట్లో రూ.40-50 మధ్య లభించాయి. కానీ రుతు పవనాలు ఆలస్యం కావడంతో రిటైల్ మార్కెట్లో కిలో టమోటా ధరలు దాదాపు రెట్టింపయ్యాయి.మండు వేసవిలో అంటే గత నెలలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలతోపాటు దేశమంతటా కిలో టమోటా రూ.2-5 మధ్య పలికింది. కానీ, ఇప్పుడు కిలో టమోటా ధర కేవలం నెల రోజుల్లో 1900 రెట్లు పెరిగింది. ఢిల్లీ మార్కెట్లలో కిలో టమోటా రూ.70-100 మధ్య విక్రయిస్తున్నారు. మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్రో రూ.80-100 మధ్య ఉండగా, రాజస్థాన్‌లో రూ.90 నుంచి రూ.110 మధ్య పలుకుతున్నాయి. పంజాబ్ లో రూ.60-80 మధ్య లభిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో్ర వర్షాల కారణంగా టమోటా తోటలు దెబ్బ తిన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడి వల్ల దిగుబడి తగ్గింది. ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచి టమోటాల సరఫరా గణనీయంగా తగ్గింది. గతంతో పోలిస్తే రైతులు టమోటా సాగు తగ్గించారని తెలుస్తున్నది. హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి టమోటా సరఫరా తగ్గిపోవడంతో వారంలో హోల్‌సేల్ మార్కెట్లలో ధరలు రెట్టింపయ్యాయని ఢిల్లీలోని ఆజాద్ పూర్ హోల్ సేల్ మార్కెట్ వ్యాపారి అశోక్ గనోర్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి రవాణా ఖర్చులు పెరగడం వల్ల కూడా ధరలు పెరిగాయన్నారు.రైతులు కూడా గిట్టుబాట ధర లభించక పోవడంతో టమోటా తోటల్లో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడటం లేదు. ఫలితంగా టమోటా తోటలపై చీడ పీడలు పెరిగిపోయి దిగుబడి తగ్గిపోవడం కూడా ధరల తగ్గుదలకు కారణం అని మహారాష్ట్రరైతులు తెలిపారు. ఇటీవల వచ్చిన బైపర్జోయ్ తుపాన్ కూడా టమోటా దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడిందని కొందరు నిపుణులు చెప్పారు. ఈ తుఫాను వల్ల గుజరాత్, మహారాష్ట్రల్లో పంట దిగుబడి తగ్గిపోయిందని. గుజరాత్ రాష్ట్రంలో పంట దిగుబడిపై తుఫాన్ ప్రభావం ఫలితంగానే ధరలు పెరిగాయి. కొత్త పంట దిగుబడి రావడానికి కనీసం ఒకటి, రెండు నెలలు పడుతుందని రైతులు చెప్పారు. విత్తనాలు వేసిన మూడు నెలల తర్వాత వారానికి రెండు సార్లు టమోటాలు వినియోగంలోకి వస్తాయని తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు. టమోటా తోటలు కనీసం ఒకటి రెండు నెలల పాటు దిగుబడి ఇస్తాయని, అదీ కూడా ఆయా విత్తనాల వెరైటీ, భూమి, వాతావరణ పరిస్థితులను బట్టి ఉంటుందని చెబుతున్నారు.

# ఎంపి కుటుంబం కిడ్నాప్ వెనకు కుట్ర

- సిబిఐ విచారతో నిజాలు బయటపడతాయి
- టిడిపి నేత వర్ల రామయ్య ఆరోపణలు



అమరావతి,జూన్26 : కుటుంబం కిడ్నాప్ కేసు ఇంకా పూర్తికాలేదని.. ఇంకా ఉందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. సోమవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ఈ కుట్ర బయటకు రావాలంటే సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. 13వ తేదీన కిడ్నాప్ అయితే.. 15వ తేదీ వరకు పోలీసులకు తెలియలేదంటే.. ఎంపీ ఈ కిడ్నాప్ విషయం పోలీసులకు చెప్పలేదంటే దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నట్లేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై ఇంత వరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. విశాఖలో భూ కబ్జా సింహాల మధ్య జరుగుతున్న లావాదేవీలే ఈ కిడ్నాప్‌కు ప్రధానాంశమని అనుకుంటున్న నేపథ్యంలో ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేయాల్సిందే నన్నారు. ఈ కేసులో రాష్ట్ర పోలీసుల దర్యాప్తు సరిగా లేనందున, ముఖ్యమంత్రి వెంటనే ఈ కేసు దర్యాప్తును సీబీఐకు అప్పగించాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.సిట్టింగ్ ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ జరిగితే లోక్‌సభ సెక్రటేరియట్ ఎందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదని వర్ల రామయ్య ప్రశ్నించారు. పట్టపగలు ఎంపీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేస్తే, రాష్ట్ర గవర్నర్ స్పందన రాష్ట్ర ప్రజలకు తెలియకపోవడంలో అర్థం ఏమిటన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన పార్టీ ఎంపీ కుటుంబ సభ్యులు కిడ్నాప్ అయితే ఎందుకు స్పందించలేదు?.. ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. కిడ్నాప్ అయిన వారిలో ఒకరైన ఆడిటర్ జీ.వీ రాష్ట్ర ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడన్నతి నిజమేనా?.. కిడ్నాప్ అయిన తర్వాత ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. 'నేను ఈ రాష్ట్రంలో ఉండను నా వ్యాపారమంతా తెలంగాణా రాష్ట్రానికి మార్చుకుంటానని చెప్పడం రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రభుత్వ ముఖాన చెప్పినట్లు కాదా?.. తర్వాత ఎంపీని సీఎంవో అధికారులు బెదిరించి నేను రాష్ట్రంలోనే ఉంటాను తెలంగాణ వెళ్లనని అతని అభీష్టానికి వ్యతిరేకంగా చెప్పించినది నిజం కాదా?' అని వర్ల రామయ్య ప్రశ్నించారు. తన కుటుంబ సభ్యుల కిడ్నాప్ బాధలో ఉన్న ఎంపీ.. ఎవరి బెదిరింపుల వలన ఈ నెల 17న రూ. కోటీ యాభై లక్షలతో 2 పేజీల ప్రతికా ప్రకటనలు అధికార పత్రికకకు ఇచ్చారని వర్ల రామయ్య అన్నారు. పత్రికకు ఇచ్చిన ప్రకటన నుంచే సీబీఐ దర్యాప్తు చేస్తే ఈ కేసులోని అసలు నిందితులు, పెద్ద తలలు బయటకు వస్తాయన్నారు.

## తెలంగాణ రాష్ట్రం పథకాలు దేశానికే స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

**కేంద్రం..** ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్సీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఉస్మానియా విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి, సామాజిక సమూహాల సాధికారత -తెలంగాణ రాష్ట్ర అనుభవాలు" అనే అంశంపై జరుగుతున్న సదస్సులో వ్యవసాయం, విద్య, కమ్యూనిటీ వృత్తి ఆధారిత పథకాలు, మహిళా సాధికారత, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి, అటవీ అభివృద్ధి సహా అనేక పథకాల తీరుతెన్నులు, అభివృద్ధిని వినోద్ కుమార్ వివరించారు. విద్యుత్తు లోటు నుంచి మిగులు రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని, భారత దేశానికి కొత్త రైస్ బౌల్‌గా తెలంగాణ మారిందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ దండెబోయిన రవిందర్ యాదవ్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు భారత్‌లో ఆర్థికాభివృద్ధికి సంబంధించిన వివిధ దశలపై విపులంగా ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను అమల్లో ఉన్న సవాళ్లను ఆయన వివరించారు. ఐసీఎస్ఎస్ఆర్ సభ్యకార్యదర్శి, న్యూఢిల్లీ ప్రొఫెసర్ ధనుంజయ్ సింగ్ ప్రసంగిస్తూ....యాభై సంవత్సరాల ప్రయాణంలో ఐసిఎస్‌సిఆర్,ఎస్ఆర్‌సి యొక్క సహకారాన్ని ప్రశంసించారు. ఐసిఎస్‌సిఆర్ ఇటీవల ప్రకటించిన స్వల్పకాలిక పథకాలలో అనుభావిక అధ్యయనాలను చేపట్టాలని ఆయన పరిశోధకులను కోరారు. సంచాలకులు ప్రొ.బి.సుధాకర్ మాట్లాడుతూ,జాతీయ సదస్సుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మూడు రోజుల పాటు జరగనున్న థీమ్ లను వివరించారు. ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, వివిధ ఫ్యాకల్టీలకు చెందిన డైరెక్టర్లు, డీన్లు, ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ సభ్యులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టిసిపెంట్లు, పేపర్ ప్రజెంటర్లు మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, హర్యానా నుంచి పాల్గొన్నారు.

# కేసీఆర్‌తో పెట్టుకున్న వారెవరూ బాగపడలేదు







నిలదీశారు. అవినీతి గురించి టిపిసిసి ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి మాట్లాడితే చంపి సంతాపం తెలిపినట్లుగా ఉందని కెటిఆర్ ఎద్దేవా చేశారు. ప్రగతి రథచక్రాలు ఆగొద్దంటే మళ్లీ బిఆర్ఎస్ రావాలని పిలుపునిచ్చారు. స్వీయ రాజకీయ అస్థిత్వమే శ్రీరామ రక్ష అని చెప్పారు. ఉప్పల్ స్కైవాక్ ను ప్రారంభించిన అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అందిస్తున్నందుకు కేసీఆర్ ను జైలులో పెట్టాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్లు, రెండు పడక గదుల ఇల్లు ఇస్తున్నందుకా? అని నిలదీశారు. జేపీ నడ్డా ఈ మాటలు మాట్లాడడానికి ఓ హద్దు అదుపూ అనేది ఉండాలని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కష్టాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నా మని చెప్పారు. ఎండా కాలంలో నీటి సమస్య లేకుండా ఇబ్బందులను సీఎం కేసీఆర్ పరిష్కరించారని అన్నారు. నారపల్లి నుంచి ఉప్పల్ వరకు రహదారి నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తీరతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నాలుగేళ్ల నుంచి రహదారుల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని ఆరోపించారు. అవినీతి గురించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాట్లాడితే పులి శాకాహారం గురించి మాట్లాడినట్లేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఒక హంతకుడే తాను చేసిన హత్యకు సంతాపం తెలిపినట్లు ఉంటుందని వ్యాఖ్యానించారు. రూ.50 లక్షల నోట్ల కట్టలతో దొరికి జైలుకెళ్లొచ్చిన వ్యక్తి చెప్పే నీతి ముచ్చట్లను మనం వినాలా? అని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో జాప్యంతో ఎంతో మంది ఉద్యమకారులు చనిపోయారని, దానికసోనియాగాంధీ కారణం కాదా? అని ప్రశ్నించారు. 9 ఏళ్లలో ఒక్కో పని చేసుకుంటూ హైదరాబాద్, తెలంగాణను అభివృద్ధి చేసుకుంటున్నామని.. పేదలను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నామని చెప్పారు. ఈ విషయాలను ప్రజలంతా గమనించాలని కేటీఆర్ కోరారు. ప్పల్ కూడలిలో రద్దీ ఎక్కువైనందున రోడ్లు దాటేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే పాదచారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రోడ్డు దాటేందుకు ఉప్పల్ చౌరస్తాలో రూ.36.50 కోట్ల ఖర్చుతో స్కైవాక్ నిర్మించారు. ఈ స్కైవాక్ ను ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం (జూన్ 26) ప్రారంభించారు. ప్రయాణికులు రామంతాపూర్ నుంచి ఉప్పల్ వైపు.. ఉప్పల్ వైపు నుంచి రామంతాపూర్ వైపు.. నాగోల్ వైపు నుంచి హబ్సీగూడ వైపు.. హబ్సీగూడ వైపు నుంచి నాగోల్ వైపు పాదచారులు స్కైవాక్ ద్వారా భద్రంగా రోడ్డు దాటొచ్చేలా నిర్మించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ మేరీ స్కూల్ లో పుస్తకాలు సీజ్



జనగామ జూన్ 26 (ప్రజామంటలు): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న హైద్రాబాద్ రోడ్డు లోని సెయింట్ మేరీస్ స్కూల్ లోని పుస్తకాల గదిని ఎస్.ఎఫ్.ఐ. జనగామ జిల్లా కమిటీ పోరాట ఫలితంగా విద్యాశాఖ అధికారి అనుమతి ప్రకారం నోడల్ అధికారి సత్యనారాయణ సీజ్ చేశారు. ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి ధర్మభిక్షం, నాయకులు లవకుమార్, వికాస్, మహేందర్, విఘ్నేష్, సందీప్, తరుణ్ పాల్గొన్నారు.

## గడప, గడపకు బీఆర్ఎస్ పాల్గొన్న కల్వకుంట్ల సంజయ్






కోరుట్ల టౌన్ జూన్ 26 (ప్రజామంటలు): గడప గడపకు బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల సంజయ్ కోరుట్ల పట్టణం లోని 16 వార్డ్ లో వర్షాన్ని కూడా లెక్క చేయకుండా పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వార్డ్ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకొన్నారు. మీకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనిల్,మున్సిపల్వైస్చైర్మన్ గడ్డ మీద పవన్, నాయకులు పాల్గొన్నారు.

## కవి మల్లయ్య మహర్షి ని సత్కరించిన మంత్రి



హైదారాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): రంగనాయక రచయితల సంఘం అధ్యక్షుడు పిన్నింటి మహేందర్ రెడ్డి సంపాదకీయంలో వెలువడ్డ "అమృత వర్షిణి" పుస్తక సంకలనం ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరుహరీష్ రావు ఆవిష్కరించి మాట్లాడుతూ.... నేడు జనం సోషల్ మీడియా మోజులోపడటం వల్ల పుస్తక పఠనం చదువడం రాను రాను తగ్గి పోయిందని కాని పుస్తక పఠనం వల్ల మనిషి జ్ఞానంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. జూన్ 25 ఆదివారం సిద్ధిపేట లోఆర్థిక, వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో పుస్తక సంపాదకులు పిన్నింటి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో "అమృత వర్షిణి" పుస్తక సంకల నంలో పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామ నివాసి రైతు, ప్రముఖ కవి, రచయిత, సామాజిక కార్యకర్త, డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, కూచన మల్లయ్య మహర్షి రాసిన "కలల అలలు" కవిత అచ్చైంది. ముఖ్య అతిథి మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగ పుస్తకం యిచ్చి శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అరవై మంది కవులు, కవయిత్రులు, సాహిత్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల డిపోలో మెగా రక్తదాన శిబిరం




కోరుట్ల జూన్ 26 (ప్రజామంటలు): తేదీ 27 మంగళవారం టి.ఎస్.ఆర్.టి.సి. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఒకరి రక్తదానం-ముగ్గురికి ప్రాణదానం" అనే కార్యక్రమం లో భాగంగా మన కోరుట్ల డిపోలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించబడుతుంది. కావున స్వచ్ఛంద సేవ సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని రక్త దాతలుగా మారి ప్రాణదాతలు కావాలని కోరుట్ల డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కొరకు 9959225928, 73828 49639, 9700212293 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## బిసి ఆర్థిక సహాయం కోరకు ఆన్ లైన్ పొరపాట్లను సరి చేయాలి



జనగామ జూన్ 26 (ప్రజామంటలు): బి.సి. ఆర్థిక సహాయం కోరకు ఆన్ లైన్ లో ఉన్న పొరపాట్లను సరిచేసి దరఖాస్తుదారుల పేర్లను సంబంధిత శాఖలకు పంపించాలని కోరుతూ బిసి సంక్షేమశాఖ అధికారికి అందజేశారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం చేతి కులవృత్తులకు లక్ష ఆర్థిక సహాయం పథకంలో భాగంగా దరఖాస్తుదారుల పేర్లు మున్సిపాలిటీ పరిధిలోనికి కాకుండా ఎం.పి.డి.ఓ. పరిధిలోకి రావడం జరిగిందని వినతిపత్రం పేర్కొన్నారు. ఈ ప్రక్రియ వల్ల ఇక్కడ అంటే అక్కడ అని అధికారుల ఆఫీసుల చుట్టు తిరుగుతూ దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రాన్ని అందచేసిన వారిలో బి.సి. ఫెడరేషన్ కులాల సమితి జిల్లా నాయకులు కొత్తపల్లి అభినాష్, శేఖర్, గట్టయ్య, రాములు, మల్లేష్, అన్వేష్, ఉపెందర్, శివప్రసాద్ ఉన్నారు.

# బీఎస్పి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

### ప్రారభించిన జిల్లా అధ్యక్షులు పుప్పాల లింబాద్రి



కోరుట్ల టౌన్ జూన్ 26 (ప్రజామంటలు): కోరుట్ల పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ కార్యాల యాన్ని జిల్లా అధ్యక్షుడు లింబాద్రి ప్రారంభించారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి జెండా ఆవిష్కరించి అనంతరం కోరుట్ల పట్టణ అధ్యక్షుడు మరియు జగిత్యాల జిల్లా మైనారిటీ ఇంచార్జ్ మొహమ్మద్ ముజాహిద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లింబాద్రి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డబుల్ బెడ్ రూములు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మరియు నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని మరియు దళిత బంధు పథకం అర్హులైన దళితులకు ప్రభుత్వం దళిత బంధు ఇవ్వడం లేదని మరియు ప్రభుత్వం బీసీ బందు పేరట కొన్ని కులాలకే బీసీ బందు పథకం ఇస్తుందని మిగతా కులాలను ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర నష్టాలకు గురి అవుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని కోరుట్ల మెట్ పల్లి మున్సిపాలిటీలలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పట్టించుకోకపోవడం విచారకరమని ప్రభుత్వ ఆఫీసుల్లో లంచాలు ఎక్కువ అయినాయని, ఏ పనికి పోయినా అధికారులు ప్రజాప్రతినిధులు డబ్బులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోరుట్ల నియోజకవర్గంలో ప్రభుత్వ భూములలో పేదలకు ఎమ్మెల్యే వెంటనే పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని లేని యెడల త్వరలో నియోజకవర్గ సమస్యల పైన బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మద్దెల నారాయణ నియోజకవర్గం ఇన్చార్జిలు గుజ్జరి ప్రకాష్, కోల రాములు, అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, తెడ్డు శేఖర్, కోరుట్ల మెట్ పల్లి ఇబ్రహీంపట్నం మల్లాపూర్ మండలాల అధ్యక్షులు శ్రీధర్, ప్రశాంత్, కిషోర్, రాందాస్, కరణ్, అఖిల్, వందలాదిమంది నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## షిరిడి సాయి ఆలయంలో సప్తాహ పారాయణం ప్రారంభం



జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): స్థానిక బైపాస్ రోడ్ లోని శిరిడి సాయి మందిరంలో గురు పౌర్ణమి ఉత్సవాన్ని పురస్కరించుకొని నేటి నుండి 7 రోజుల వరకు సప్తాహ దీక్షతో సాయినాథ చరిత్ర పారాయణం ప్రారంభమైంది. సాయి చెప్పిన సూత్రాలలో శ్రద్ధ సబూరి ఏ పనైనా శ్రద్ధతో చేస్తూ, సమస్త జీవరాసుల పైన మానవత్వ విలువలను సూచిస్తూ ధర్మాన్ని ఆచరిస్తూ భగవంతుని చేరుకోవడానికి సూచించే శక్తియే గురువు. అలాంటి గురువును స్మరిస్తూ సూచించిన మార్గంలో పారాయణాన్ని కొనసాగిస్తూ, సమస్త మానవాళికి, ఆయురారోగ్య భోగభాగ్యాలు, పాడి పంటలు, సక్రమంగా ఉండాలని, లోక కళ్యానార్థం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమ క్రతువుని బ్రహ్మశ్రీ తిగుళ్ళ విశు శర్మ, ఆలయ అర్చకులు వేణుమాధవాచార్య, సంజయ్ పండిత్, ప్రభాకర్ శర్మ, నిర్వహించారు. ఈనాటి కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు డాక్టర్ సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్ , మార కైలాసం, మానాల కిషన్, తవుటు రవిచంద్ర, కంచికిషన్, మారుతి రావు, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, తిరుపతి గౌడ్, మారుతి, గంగాధర్, రామకృష్ణారావు, భక్తులు మాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం 7 రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# నిరుపేద ఆడబిడ్డ పెళ్లికి కెసిఆర్ కానుక

### షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకం

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): పట్టణ 30వ వార్డు కి చెందిన నజ్నీన్ అతెర్ కి షాదీ ముబా రక్ పథకం ద్వారా మంజూరైన ఒక లక్ష రూపాయలు విలువ గల చెక్కును జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నిరుపేద ఆడబిడ్డ పెళ్లికి కట్నంగా ముఖ్యమంత్రి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ముఖ్యమంత్రి ఆడబిడ్డలకు పెళ్లికి ఇచ్చే కానుక కళ్యాణ లక్ష్మి షాది ముభారక్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలంగాణ ఆచరిస్తే దేశం సంక్షేమ పథకాలను అనుసరిస్తుందని అన్నారు. చెక్కుతో పాటు తన వంతుగా చీర అందజేస్తున్నానని, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఈ కార్యక్రమం అమలు పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో 30 వార్డు ఇంచార్జ్ పట్టణ ఉపాధ్యక్షులు దుమాల రాజ్ కుమార్, ఏఎంసి వైస్ చైర్మన్ అసిఫ్, జెమీల్, పట్టణ ఉపాధ్యక్షులు, వొల్లం మల్లేశం, సర్పంచ్ బోనగిరి నారాయణ, తాజొద్దిన్, యూత్ ఉపాధ్యక్షులు రాజు, జుంబర్తి శంకర్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ప్రభుత్వమే పెట్టాలి



జనగామ జూన్ 26 (ప్రజామంటలు): దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ప్రభుత్వమే పెట్టాలని సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. జనగామ జిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని కురుమ సంఘం కమీటి హాల్ లో అధ్యక్షులు మోటే దేవేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ.... తెలంగాణ రైతంగా సాయుధ పోరాటయోధుడు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటం చేసి ఒక మహోన్నత ఉద్యమానికి ఆద్యుడు అని అన్నారు. కొమురయ్య వర్ధంతి, జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షదాయకమని అన్నారు. దొడ్డి కొమురయ్య విగ్రహం పెట్టానికి జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర ఏర్పాటుకు గద్దె నిర్మాణం చేసి కురుమ సంఘం నాయకులు ఇంటికి వెళ్లగానే ఎండోమెంట్ అధికారులు ఏలాంటి సమాచారం ఇవ్వకుండ గద్దెను కూల్చి వేశారన్నారు. జిల్లా కలక్టర్, స్థానిక ఎం.ఎల్.ఎ. స్పందించాలన్నారు. జూలై 4 న దొడ్డి కొమరయ్య విగ్రహం ఆవిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు జీగారి యాదగిరి, గుండా వెంకటయ్య, జిల్లా కమీటి సభ్యులు బుమాండ్ల కుమారస్వామి, మాయ రాములు, కర్రే కృష్ణ, మరాఠి జంపన్న పాల్గొన్నారు.

## పశుమిత్రలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



జనగామ జూన్ 26 (ప్రజామంటలు): పశుమిత్రలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కాసు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జనగాం జిల్లా కమిటీ ఆద్వర్యంలో జిల్లా కలెక్టర్, పశుసంవర్ధక శాఖ జెడి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాసు మాధవి మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలకు సోకే వ్యాధులకు వైద్యం చేస్తున్న పశుమిత్రలను ప్రభుత్వం వెంటనే కార్మికులుగా గుర్తంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, యూనిఫాం ఇవ్వాలని, మెడికల్ కిట్ ఇవ్వాలని, పశుమిత్రలందరికీ ఏఐ ట్రైనింగ్ ఇవ్వాలని, పశుమిత్రలందరికీ వారి గ్రామ పశుసంపదకు సరిపడా వ్యాక్సిన్ ఇవ్వాలని, పశుమిత్రలకు వేతనం నిర్ణయించి ఇవ్వాలని అప్పటి వరకు పారితోషికం చెల్లించాలని అన్నారు. జనగామ సిఐటియు జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు మాట్లాడుతూ.... గ్రామ స్థాయిలో రైతులకు పశు మిత్రలు అందుబాటులో ఉంటూ పశువులకు సోకే సుమారు పన్నెండు రకాల పశు వ్యాధులు, వైరస్ లకు గాయాలకు ప్రథమ చికిత్స చేస్తూ రైతుల తలలో నాలుకాల ఉంటు ప్రభుత్వానికి సేవ చేస్తున్నారని, వీరి న్యాయమైన కోర్కెలను పరిష్కరించక పోవడం సరైంది కాదని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పశుమిత్రల జిల్లా అధ్యకురాలు నాజియా, కార్యదర్శి కొంగరి మంగ, శ్రావణి, సంధ్య, స్వప్న, అనిత, సంధ్యారాణి, రాజేశ్వరి, రాణి, స్వప్న, శ్యామల, కోమల, స్రవంతి, పద్మ, సరళ, మనీల పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో చదువుపై పట్టు సాధించేలా పఠనోత్సవ కార్యక్రమం



### విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు

మొగుళ్ళపల్లి జూన్ 25 (ప్రజామంటలు): ఎంపీపీ ఎస్, జెడ్.పి.హెచ్.ఎస్. రంగాపురంలో సోమ వారం పఠనోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులలో ధారాళంగా తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో చదవగలిగే సామర్థ్యాన్ని పెంపొందించడంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పఠనోత్సవ కార్యక్రమం ఎంతో మేలు చేకూరుస్తుందని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రఘు, సత్యనారాయణ, శర్మ, మార్కండేయ, సదానందం, మాధవి, పద్మ, లక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ట్రెజరర్ యాటెల్లి చిట్టిబాబు మృతి



జనగామ జూన్ 26 (ప్రజామంటలు): జనగామలో రూథర్ ఫర్డ్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్, జనగామ జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ట్రెజరర్ యాటెల్లి చిట్టిబాబు మృతి చెందారు. మృతికి క్రైస్తవ నాయకులు. డా. కె.ఎం. జాన్, డా. పి.ఫిలిప్, నల్ల జాన్, కె. మోసెస్ కుమార్, డా. దేవసహాయం, జి. నర్సింగరావు, ఎస్. దేవదానం, డా. సంజీవ్ కుమార్, సి.హెచ్. ప్రభాకర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ విజయవంతం



కోరుట్ల టౌన్ జూన్ 26 (ప్రజామంటలు): కోరుట్లలో ఉన్న ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నింటిని బంద్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మాడవేని సునీల్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక పాఠశాలలని విలవిలలాడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు అందలేక విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నటువంటి దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొన్నది దుస్తులు లేక పాఠ్యపుస్తకాలు లేక విద్యార్థులందరూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ప్రభుత్వ పాఠశాలకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించి మౌలిక వసతులను కల్పించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ పవన్, సంజీవ్, అభి, మాసం వినయ్, సూరజ్, పవన్, సాయి ప్రసాద్, వికాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

## వర్షకొండలో పఠనోత్సవం



ఇబ్రహీంపట్నం జూన్ 26 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పఠనోత్సవము (రీడింగ్ కాంపెయిన్) కార్యక్రమంను ప్రారంభించినట్టు ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సోమవారం 26 జూన్ నుండి జులై 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి దారాళంగా చదవడంతో పాటు, పఠనాసక్తి కలిగించడం కోసం ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అంతే కాకుండ ప్రతి తరగతికి గ్రంథాలయ పీరియడ్ ద్వారా కథల పుస్తకాలు, వార్త పత్రికలు, బాల సాహిత్యం వంటివి ఇచ్చి చదివే సామర్థ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, కృష్ణప్రసాద్, మురళి, ఇమ్మానుయేల్, మమత, ఇబ్రహీం, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



జనగామ జూన్ 26 (ప్రజామంటలు): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య ఆదేశించారు. సోమవారం జనగామ కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని తమ పరిధిలో లేని విషయాలకు దరఖాస్తుదారులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సోమవారం ప్రజావాణిలో జఫర్గడ్ మండలం కేంద్రానికి చెందిన పులి లచ్చయ్య తమ భూమిపై కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న రిజిస్ట్రేషన్ చేశారని అట్టి రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయాల్సిందిగా కోరారు. జనగామ మండలం పెద రామంచెర్ల కు చెందిన గూడ బుచ్చిరెడ్డి, పట్టేదారు పాసుబుక్కులు మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. జనగామ పట్టణం గిర్నిగడ్డకు చెందిన శౌర్య తనకు పెన్షన్ మంజూరు అయిందని వేలిముద్రల సమస్య వలన పెన్షన్ రావడంలేదని అట్టి సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు చేశారు. చెన్నూరు కు చెందిన గౌడ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు రెండు పదవులు నిర్వహిస్తున్నారని వెంటనే తొలగించాలని దరఖాస్తు చేశారు. బచ్చన్నపేట మండలం కటుకూరు గ్రామానికి చెందిన బూడిద ఆండాలు నిరుపేద మహిళను అని దివ్యాంగుడైన కుమారుడు ఉన్నాడని తనకు అంత్యోదయ కార్డు మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేశారు. తెలంగాణ పశుమిత్రుల వర్కర్స్ యూనియన్ వేతనాలు మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేశారు. ఈరోజు రెవెన్యూ శాఖకు సంబంధించినవి (50) పంచాయతీరాజ్ (7) సివిల్ సప్లై (2) పురపాలక సంఘం (4) తదితర డిపార్ట్మెంట్లు కలిపి (71) దరఖాస్తులు ఈరోజు వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డిఓ ఘన్పూర్ కృష్ణవేణి, డిపిఓ రంగాచారి, సిపిఓ ఇస్మాయిల్, డిఏఓ వినోద్ కుమార్, ఎన్పీడీసీఎల్ ఎసి ఈ వేణుమాధవ్, కలెక్టరేట్ సూపరిండెంట్ యతేశాం అలీ, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అజరామరాలు... కాళ్ళకూరి నాటకాలు

## జూన్ 27...కాళ్ళకూరి నారాయణరావు వర్ధంతి



తెలుగు నాటక రంగ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నాటకాలు... వరవిక్రయము, చింతామణి. ఆ రెండూ తెలుగు వైభవం చాటే నాటకాలు. రెండూ కూడా చలన చిత్రాలుగా రూపొంది ప్రజాదరణ పొందడం విశేషం. వరవిక్రయము అప్పటి సాంఘిక దురాచరాన్ని ఎండగడితే " చింతామణి" సజావుగా నడిచే జీవితం ఎలా నాశనం అయిపోవచ్చో అద్దం పడుతుంది. ఆ నాటకాలను రచించి తెలుగు వారి హృదయాలలో చిరకాలం నిలచి పోయారు కాళ్ళకూరి నారాయణరావు.

నారాయణ రావు కేవలం నాటక రచయిత మాత్రమే కాదు. బహుకళా ప్రపూర్ణులు. సంఘ సంస్కర్త, మొట్టమొదటి ప్రచురణ కర్త, హరికథకులు, కవి, నటులు, నాటకకర్త, పత్రికాధిపతి, మనోరంజని అనే పత్రికను నడిపారు. నాటి సమాజంలో ఉన్న దురాచారాలను ఎత్తి చూపించి, నాటకాలుగా మలచి, ప్రదర్శించడమే కాక, సంఘ సంస్కరణను ఆచరణలోనూ చూపించిన మహనీయుడు కాళ్ళకూరి నారాయణరావు. చక్కన్ని ఒరవడి, సంస్కారం, అధర్మాన్ని నిర్భయంగా ఎదుర్కనే శక్తి, ధైర్యం, సామాజిక స్పృహ, నైతిక విలువలపట్ల విశ్వాసం, బాధ్యతలు విస్మరించిన వారిని వెన్ను తట్టి లేపడం, సాంఘిక దురాచారాలపై ధ్వజం ఎత్తడం, ఇవన్ని కలిగలిపి రూపు దిద్దుకున్న వ్యక్తిత్వం కాళ్ళకూరి నారాయణ రావుది. ఆ కాలంలో కులాంతర వివాహం చేసుకోవడమంటే పెద్ద సాహసం. కళావంతురాలిని పెళ్లి చేసుకున్నారు. తనను కులం నుండి వెలివేసినా, లెక్కచేయని సాహసి, కవితారూప తపస్వి, బహు ప్రతిభా తేజస్వి. సంఘంలోని దురాచారాలను నాటకరాజాలుగా సృష్టించారు. చింతామణి, వరవిక్రయం, మధుసేవ మొదలైన ఆయన విరచిత నాటకాలు అజరామరమైనవి.

కాళ్ళకూరి నారాయణరావు (ఏప్రిల్ 28, 1871 – జూన్ 27, 1927) నాటకకర్త, సంఘసంస్కర్త, ప్రథమాంధ్ర ప్రచురణ కర్త, జాతీయవాది, ఛాయా గ్రహణ వాద్యాదురంధరుడు, 'మహాకవి' బిరుదాంకితులు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరము మండలం, మత్స్యపురి గ్రామంలో 1871, ఏప్రిల్ 28 న బంగారురాజు, తల్లి అన్నపూర్ణమ్మలకు జన్మించారు. అయన రచించిన నాటకాలలో చింతామణి (1921), వర విక్రయం (1923), మధుసేవ (1926) బాగా ప్రసిద్ధిచెందినవి. వాటిని చాలా మంది నాటకాలుగా ప్రదర్శించారు. తెలుగు సినిమాలుగా కూడా నిర్మించబడి మంచి విజయం సాధించాయి. తెలుగు నాటక రంగంలో పది అత్యుత్తమ నాటకాలలో చింతామణి ఒకటి. ఆ నాటకం చాలా ప్రసిద్ధి చెందింది. 1956లో పి.ఎస్. రామకృష్ణరావు దర్శకత్వంలో ఎన్టీఆర్, భానుమతి ప్రధాన పాత్రలుగా భరణి స్టూడియోస్ బ్యానర్ పై సినిమాగా నిర్మించారు. "చింతామణి " నాటకం తెలుగు నాటక రంగాన్ని ఓ ఊపు ఊపింది. ఒక వ్యసనం వ్యక్తిని ఎంత హీన స్థితికి దిగజారుస్తుందో, పర్యవసానాలు ఎంత దారుణముగా ఉంటాయో ప్రతిబింబించారు. ఆ నాటకానికి కనీ వినీ ఎరుగని ఆదరణ లభించింది. ఆదాయానికి లోటులేకండా ఇంకా మరిన్ని నాటకాలు సమర్పించడానికి వీలుగా బోళ్ళు డబ్బు తెచ్చి పెట్టింది. చింతామణి నాటకం వేశ్యావృత్తికి వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్న కాలంలో రాయబడింది. వేశ్యావృత్తిని నిరసిస్తూ కాళ్లకూరి రచన ఈ నాటకం. ఆనాడు చింతామణిని ప్రదర్శించని నాటక సమాజమంటూ లేదు. ఈ నాటకంలోని పద్యాలు ప్రజల నోటిలో తాండవించాయి. సంస్కార భారతి వారు ఈ నాటకాన్ని ఇటీవల కాలం వరకు ప్రదర్శించారు. ఆ నాటకం బహుళ ప్రాచుర్యం పొందింది. నేటికీ విజయవంతంగా ప్రదర్శిత మవుతోంది.

గురజాడ కాలంలో "కన్యాశుల్కం", తరువాత "వరవిక్రయం" అంతటి ఘనత లభించింది. రెండూ తెలుగు నాటక రంగ ఇతిహాసంలో ఆణిముత్యాలే. కన్యాశుల్కం అప్పటి సాంఘిక దురాచారాన్ని ఎదుర్కుంటే, వర విక్రయం ఆ కాలం సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతూ ఆ సాంఘిక దుస్థితిని ఎండకడుతూ వచ్చింది.

గురజాడ " కన్యాశుల్కం" సాంఘిక దురాచారాలని ఖండిస్తూ, మార్పుకు అంకురార్పణ చేస్తే, కాళ్ళకూరి నారాయణరావు గారి సాంఘిక నాటకం – వరవిక్రయం (1921), అప్పటి సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతూ అనర్థ హేతు చర్యలు వ్యతిరేకిస్తూ, సాంఘిక ధర్మానికి పాటుపడింది. ఆ కాలంలోని సామాజిక సమస్యలకు తనదైన విచార ధారతో విశ్లేషించి, లోకం తీరును వరవిక్రయం రూపంలో మలిచారు. పెళ్ళి చేసుకోవడానికి భారీగా కట్న కానుకలు వసూలు చేస్తూ, వివాహం ఐదు రోజులు జరిపించుకొని, వైభవోపేతముగా సేవలు చేయించుకోవడం, పిల్ల తల్లి తండ్రులను అప్పుల ఊబిలోకి నెట్టి వేయడం వంటి పరిస్థితులను ప్రతిఘటించడానికి, నైతిక భాద్యతలను నిర్వర్తించేందుకు పిలుపునిచ్చారు.

సి.పిల్లయ్య 1939 లో వరవిక్రయము సినిమా తీసారు. భానుమతి రామకృష్ణ ఆ సినిమాలో కాళింది గా నటించారు. ఈ చిత్రం ద్వారా ఆమెకు మంచి పేరు వచ్చింది. సింగరాజు లింగరాజుగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారు వేశారు. "నటన అంటే అది" అని అనిపించు కున్నారు.

ఆయన రచనలలో...మద్యపానం వలన కలిగే దుష్పరిణామాలను ఎత్తి చూపిన నాటకం మధుసేవ. అలాగే రాజరాజ నరేంద్రుని కుమారుడని పేర్కొనే సారంగ ధరునికీ, చిత్రాంగికీ నడుమ జరిగిన కథ చిత్రాభ్యుదయం. అంతేగాక పద్మ వ్యూహం (1919) , సంసార నటన (1974 కళలో ధారావాహికగా ప్రచురితం) మొదలైన నాటకాలు కారణంలేని కంగారు (1920), దసరా తమాషాలు (1920), లుబ్ధాగ్రేసర చక్రవర్తి (1906), రూపాయి గమ్మత్తు (1920), ఘోరకలి (1921), మునిసిపల్ ముచ్చట్లు (1921), విదూషక కపటము (1921) వంటి ప్రహసనాలు ఆయన రచించారు. కాళ్ళకూరి 1919 లో రాసిన " పద్మవ్యూహం" నాటకంలో పద్యాలతో ఉన్న సంభాషణలను పొందు పరిచారు.

ప్రముఖ రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ...కాళ్లూరి శిష్యులు కాగా, కొత్తె వెంకటాచారి నారాయణరావు... నాటకాల మీద పి.హెచ్.డీ చేశారు. కాళ్లూరి 1927, జూన్ 27న మరణించారు.



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

# కుడితిలో పడ్డ ఎలుకలా ...బిజెపి పరిస్థితి!

రాష్ట్రంలో అధికార బిఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిలను దుమ్మెత్తి పోయడానికి కాంగ్రెస్ పార్టీకి అవకాశాలు కలసి వస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మారుతున్న పరిస్థితులు, పరిణామా లను కాంగ్రెస్ చక్కగా వినియోగించుకుంటోంది. మొన్నటి వరకు కవిత లిక్కర్ స్కామ్‌పై ఎవరూ ఊహించ నంతగా హడావిడి జరిగింది. ఇక కవితను అరెస్ట్ చేయడమే ఆలస్యం అన్నంతగా పరిస్థితులను కల్పించారు. కానీ ఏమయ్యింది....అంతా తుస్సుమంది. జెపి నడ్డా వచ్చి బిఆర్ఎస్ అవినీతిపై నిప్పులు చెరిగినా ప్రజలు నమ్మేస్థితిలో లేరు. 9ఏళ్లుగా అవినీతి గురించి మాట్లాడే బిజెపి నేతలు ఒక్కటంటే ఒక్క అవినీతి కేసును కూడా రుజువు చేయించలేక పోయారు. ఇప్పుడీ విషయమే కాంగ్రెస్‌కు ఎన్నికల ప్రచారాంశంగా కలసి వస్తోంది. ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి కవిత విషయమై హడావిడి చేసిన కేంద్ర ఏజెన్సీలు ఇప్పుడు మౌనం వహించాయి. ఢిల్లీలో ఏం జరిగిందో అర్థంకాక బీజేపీ రాష్ట్ర నాయకులు తలలు పట్టు కుంటున్నారు. ఇదే అదనుగా కాంగ్రెస్ విమర్శలకు పదను పెట్టింది. మరోవైపు మొన్నటికి మొన్న శుక్రవారం పట్నాలో జరిగిన ప్రతిపక్షాల సమావేశానికి ముఖ్యమంత్రి,బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆహ్వానం అంద లేదు. విపక్షాలను ఐక్యం చేసేందుకు గతంలో అందరినీ కలసిన కెసిఆర్‌ను నితీశ్ కుమార్ ఎందుకు పిలవ లేదన్నది చర్చగా మారింది. అలాగే ఎపి నుంచి జగన్‌ను కూడా పిలవలేదు. ఈ సమావేశంలో అందరూ కనిపించినా కెసిఆర్, జగన్‌లు మాత్రం కనిపించలేదు. ఇదే సందర్భంగా మంత్రి కెటిఆర్ ఢిల్లీలో హడావిడి చేశారు. కేంద్రమంత్రులను వరసబెట్టి కలిశారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయంపై వినతిపత్రాలు అందచేశారు. పనిలోపనిగా విపక్షాల ఐక్యతపై విమర్శలు కూడా చేశారు. కలవాల్సింది పార్టీలు కాదు.. ప్రజలు ఏకం కావాలని అన్నారు. ఇది గతంలో తనతండ్రి, సిఎం కెసిఆర్ చేసిన ప్రయత్నాలకు విరుద్ధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. కేటీఆర్ ఢిల్లీ వెళ్లి హోం మంత్రి అమిత్ షాను కలిసే ప్రయత్నం చేయడం, పట్నా సమావేశాన్ని ప్రతిపక్షాల హడావిడిగా తేల్చేయడంతో కొత్త అనుమానాలు మొదల య్యాయి. దీనిని అదనుగా తీసుకుని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఠాక్రే బిఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగారు. ఇదంతా బిఆర్ఎస్, బిజెపిల అవగాహనలో భాగమని తేల్చేశారు. విపక్షాల ఐక్యత రోజే..బిఆర్ఎస్ నేత కెటిఆర్ కేంద్రమంత్రులతో మంతనాలకు ఢిల్లీకి వెళ్లారని అన్నారు. కాంగ్రెస్‌కు వచ్చినట్లుగానే ..ఇదంతా చూస్తున్న ప్రజలకు కూడా బిజెపి, బిఆర్ఎస్‌ల మధ్య అవగాహన వచ్చిందన్న అభిప్రాయం కలుగుతోంది.తెలంగాణలో భారతీయ జనతా పార్టీ నాయకుల పరిస్థితి ఇప్పుడు కుడితిలోపడ్డ ఎలుకలా ఉంది. ఢిల్లీ స్థాయిలో బీజేపీ కేంద్ర పెద్దలకు, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కూ మధ్య ఎటువంటి అవగాహన ఏర్పడిందో తెలియదు.





## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విష యాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.coఎకు పంపవచ్చు..

–ఎడిటర్

# "పైపై మెరుగులు



"పైపై మెరుగులు చూసి మోసపోకూడదు. పైకి ఎంతో మంచిగా కనబడుతూ కొంతమందిలో మోసం,దగాకోరు బుద్ధులు దాగి ఉంటాయి, కొంతమంది ఏ కపటం లేకుండా మానసికంగా మంచిగా ఉంటూ మేలు చేసే విధంగా ఉంటారు, కనుక మనుషుల్ని తరచి చూస్తే అసలు విషయం తెలుస్తుంది" చెప్పారు జ్ఞానానందస్వామి. "పైకి కొందరు ఎంతో సౌమ్యంగా కన్పిస్తూ తియ్యటి మాటలు చెబుతుంటారు మరి వారిలో మోసపూరిత భావాలు ఉన్నట్టు తెలుసుకోవడం ఎలా స్వామి?"అడిగాడు సత్యవంతుడు. "ఎవరితోనైనా ఓ పది నిముషాలు లోకంతీరు,కొన్ని ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడితే వారికి తెలియకుండానే బయట పడతారు"చెప్పారు జ్ఞానానంద స్వామి. ఇంకా ఈ విధంగా చెప్పారు, "రేపు ఇక్కడకురా నీకు ఈ విషయం మీద మరింత అవగాహన కలిగిస్తాను"చెప్పారు జ్ఞానానంద. రెండోరోజు సత్యవంతుడు జ్ఞానానంద స్వామి ఆశ్రమానికి వెళ్ళాడు.జ్ఞానానంద రెండు చెంబుల్ని తన శిష్యుడు చేత తెప్పించాడు. ఒక చెంబు వెండిది నగిషీలతో ఉంది. మరోచెంబు మామూలు రాగి చెంబు. "సత్యవంతా నీవు ఈ చెంబుల్లో ఉన్న ద్రవాలను పరిశీలించు" అన్నారు జ్ఞానానంద.

వెండి చెంబు నగిషీలతో ఆకర్షణీయంగా ఉంది కాబట్టి ఆ చెంబులోని నీటిని తన కుడిచేతిలోకి ఒంపుకుని వాసన చూసాడు, అవి పేడ నీళ్ళు. సత్యవంతుని మొహంలో ఆవాసన వలన కలిగిన మార్పును చూసి, " చూసావా సత్యవంతా పైకి తళతళ లాడుతూ నగిషీలతో కనబడిన చెంబు చూసి నీవు ఆకర్షితుడయ్యావు అందులో నీటిని పలిశీలించాక అవి పేడనీళ్ళని నీకు అర్థం అయింది. కొందరు చెప్పే మాటల్ని గుడ్డిగా నమ్మకూడదు,ఉదాహరణకి ఓ వ్యక్తి కాషాయ వస్త్రాలు ధరించి మీఇంటికి వచ్చి మీ ఇంట్లో నిధి ఉందని ఇంట్లోని బంగారంతో పూజ చెయ్యాలని చెబితే గుడ్డిగా నమ్మకూడదు. వాడు చెప్పినదానిలో మోసం ఉందని కాస్త ఆలోచిస్తేవాడిది మోస బుద్ధి అని తెలిసి పోతుంది" అని చెప్పి " ఇప్పుడు ఈ రాగి చెంబులోని నీళ్ళను పరిశీలించు" అన్నారు జ్ఞానానంద. సత్యవంతుడు శుభ్రంగా చెయ్యి కడుక్కుని రాగి చెంబులో నీళ్ళను పరిశీలిస్తే అవి గంధం నీళ్ళు మంచి వాసన వస్తున్నాయి. సత్యవంతుని మొహంలో ఆనందం కనబడింది. "చూసావా సత్యవంతా మామూలు రాగి పాత్ర అయినా మంచి గంధం నీళ్ళు ఉన్నాయి. నీవు చేతిని శుభ్రం చేసుకుని మరలా మంచి గంధం నీళ్ళు వాసన చూసావు,అదే విధంగా మోసగాడిని వదలించుకుని మంచి వాళ్ళ సలహా తీసుకుని మంచిని ఆచరిస్తే జీవితం బాగుంటుంది" అని వివరించారు జ్ఞానానంద. "స్వామీ నాకు కోందరి మనుషుల కపటం మీద అవగాహన వచ్చింది ఎవరేది చెప్పినా ఆ మాటలను గురించి ఆలోచించాలి. లేక మన శ్రేయోభిలాషుల సలహా తీసుకోవాలి. మంచినే ఆచరించాలి" అని తెలుసుకున్నాను" అని చెప్పి నమస్కారం పెట్టి సత్యవంతుడు ఆనందంగా వెళ్ళి పోయాడు.

కంచనపల్లి వేంకట కృష్ణారావు
హైదరాబాద్, 9348611445

# వెండితెర కొంగుబంగారం ముళ్ళపూడి వారు

"ముళ్ళపూడి వెంకటరమణ గారు" ఈ పేరు వింటే సాహితీ పూతోట, సినీ వినీలాకాశం ఆనందంతో పరవశించి పోతాయి. పక్షులు కిలకలా రావములతో, కోయిలమ్మ కుహు కుహు రాగాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తాయి. వీరి మాటలు వింటే చాలు చిలకమ్మ సైతం వీరి భుజం మీద వాలి పంచదార చిలక పలుకుల్తో మరిన్ని సరికొత్త పదాలను పలుకుతూ వారి కలానికి మరింత పదును పెట్టిస్తుంది. నక్షత్రాలు సైతం మిలమిలా మెరుస్తాయి. చందమామ వేయి వెలుగుల కాంతులు విరజిమ్ముతుంది. ప్రకృతిమాత తన పిల్ల గాలులతో పరవశింపజేస్తు కొమ్మలు, రెమ్మలతో వింజామరలు వీస్తూ వారు రాసే కథలకు మంచి బలాన్ని చేకూరుస్తాయి. ఇలా పంచభూతాల్ని సైతం తన సరిగమల పద విన్యాసాలతో పరవశింపజేస్తున్న ముళ్ళపూడి వెంకట రమణగారు వేదంలా ఘోషించే గోదావరి నదీమ తల్లికి అతి చేరువలో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం లో 1931 జూన్ 28న సినీ కళామతల్లుల ముద్దుబిడ్డగా జన్మించారు. వీరి పూర్తిపేరు ముళ్ళపూడి వెంకట రమణ రావు. తండ్రి సింహాచలం తల్లి ఆదివిష్ణు గార్ల వరాల పంట. పుడుతూనే తొలిసారి కెవ్వుమని నవ్వారట. ఇంకా వీరు "బంగారం" అన్నట్లుగా పుడుతూనే 10 పౌండ్లు ఉన్న పండంటి బిడ్డగా నర్సింగ్ హోమ్ నుండి "బెస్ట్ బేబీ గోల్డ్ కాయిన్" ను గెలుచుకున్నారు. ఇలా ముళ్ళపూడి వారి సువర్ణాధ్యాయం మొదలైంది.వీరి తండ్రి చిన్నతనంలోనే పరమపదించడంతో తల్లి రమణ గారిని తీసుకొని మద్రాసులోని అక్క బావల ఇంటికి వెళ్ళారు. మద్రాసులో 5, 6 తరగతులు చదివారు. ఆ తర్వాత రాజమండ్రి వీరేశలింగం హైస్కూల్లో, ఇంకా ఎస్.ఎస్.ఎల్.సి నుంచి ఆనర్స్ వరకు కేసరి స్కూల్లో చదివారు. వీరు చిన్నతనం నుండి కూడా అపారమైన తెలివితేటలతో ఉండేవారు. పాఠశాలలో చదువుతున్నప్పుడే లెక్కలు, డిబేట్, వ్యాసరచన పోటీల్లో అత్యధిక ప్రతిభను చూపేవారు. హాబీగా పద్యాలు కూడా అద్భుతంగా రాసేవారు. ఇంకా నాటకాల్లో వేషాలు కూడా వేశారు. కుటుంబ పరిస్థితులు అనుకూలించక వీరు పదవ తరగతితోనే చదువును ఆపేశారు. అయినా కూడా వీరి మెదడు విజ్ఞాన భాండాగారం. బడిలో చెప్పే పాఠాలే కాక బతుకు పాఠాలే ఎక్కువగా చదివిన రమణగారు తన జీవన గమనంలో చవిచూసిన ఎన్నో ఆటుపోట్లు, అగాధాలు, ఆశాభంగాలు ఆయన్ని ఓ గొప్ప రచయితగా, సినీ కథకునిగా తీర్చిదిద్దాయి.వీరు బాపు గీసిన బొమ్మల్లే ఉండే తెలుగింటి ఆడపడుచు శ్రీదేవిని వివాహం చేసుకున్నారు. అతి చిన్న వయసులోనే వీరి మొదటి కథ "అమ్మ మాట వినకపోతే, బాల శతకం పద్యాలు" ప్రచురితమయ్యాయి. ఆ ఉత్సాహంతోనే "ఉదయభాను" అనే పత్రికను నడుపుతూ ఎడిటరుగా ఉన్నారు ఆ పత్రికకి. ఆ తర్వాత ఆంధ్ర పత్రికలో పనిచేశారు. ప్రముఖ కార్టూనిస్టు సినీ డైరెక్టర్ వీరి ప్రాణ స్నేహితులు. బాపు మొదటి గీత, రమణ తొలి రాత 1945లో అచ్చయ్యాయి. ఒకరు గీతగా, మరొకరు రాతగా పత్రికలో వీరి ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత సినీ వినిలాకాశంలో విజయ బావుటా ఎగురవేశారు.వీరు రచనా వ్యాసంగంలో అందవేసిన చేయి. అలాగే వీరి రచనలలో ప్రసిద్ధమైనవి "బుడుగు". చిన్నపిల్లల భాష, మనస్తత్వం, అల్లరి గురించి హాస్య ప్రధానమైన బొమ్మలతో కూడిన చక్కని రచన ఇది. ఇంకా వీరి రచనల్లో "రుణానందలహరి, విక్రమార్కుని మార్కు, సింహాసనం, సినీ మాయ లోక చిత్ర విచిత్రం, సినిమాలపై సెటైర్లు, గిరీశం లెక్చర్లు, ఇద్దరమ్మాయిలు –ముగ్గురు అబ్బాయిల ప్రేమాయణం, రాజకీయ బేతాళ పంచవింశతి.... " లాంటివి ఎన్నో సాహితీ పూతోటలో మల్లెల గుబాళింపుతో విరబూయించారు. వీరి సాహిత్యాన్ని విశాలాంధ్ర పబ్లిషర్స్ వారు ఎనిమిది సంపుటాలుగా ప్రచురించారు. వీరు సినీ మాట ల రచయిత. వీరు మాటలు రాయడమే కాదు, సినిమాలకు కథలు కూడా రాశారు. వీరు సృష్టించిన సినిమాల్లోని పాత్రలు తెలుగువారి జీవన విధానంలో కలిసిపోయాయి. మొదట్లో పింగళి నాగేంద్రం గారు, రమణ గారు రాసిన మాటల్లాంటి ముత్యాల మూటలు తెలుగు వ్యవహారిక పదకోశంలో చేరిపోయాయి. వీరు నవలలు కూడా రాశారు. వీరి నవ్వుల సాహిత్యంలో సృష్టించినటువంటి అనేక పాత్రలు ఎప్పటికీ చిరంజీవిగానే నిలిచిపోతాయి.ఈ ఇద్దరు జంట సినీ కవలలు బాపు–రమణలు నవయుగ శ్రీనివాసరావు గారి ప్రోత్సాహంతో సినీ జీవితం అద్భుతంగా ఆవిష్కృతమైంది. ఆ తర్వాత అక్కినేని నాగేశ్వరావుని బుద్ధిమంతుడుగా మార్చి ఓ చక్కని విజయాన్ని అందుకున్నారు. అలాగే బాలరాజు కథ కూడా విజయ పథంలో దూసుకు వెళ్ళింది. అలాగే శోభన్ బాబుని రాముడుగా చూపిస్తూ చక్కని సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించారు. ఎన్టీ రామారావు తో కలిసి శ్రీ రామాంజనేయ యుద్ధం మొదలుపెట్టారు. యుద్ధం విజయవంతంగా ముగిసిం ది. సరిగ్గా అప్పుడే వెండితెరపై ముత్యాలముగ్గు వేసిన బాపూ రమణలు ఓ సరికొత్త ట్రెండుకు శ్రీకరం చుట్టారు.విలన్ అంటే అచ్చు ఇలానే ఉండాలి అన్నంత గొప్పగా రావు గోపాలరావు పాత్రని మలచి వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. అలాగే భక్తకన్నప్ప సినిమా సినీ వినీలాకాశంలో ఆణిముత్యంగా ప్రేక్షకుల నీరాజనాలందుకుంది. ఇంకా మన ఊరి పాండవులు, మంచి విజయం సాధించాయి. గోరంత దీపం గోరంతల్ని కొండంతలు చేసింది.ఆ తర్వాత తూర్పు వెళ్ళే రైలు, కలియుగ రావణాసురుడు, వంశవృక్షం, పండంటి జీవితం సినిమాలు తారాజువ్వల్లా దూసుకు వెళ్ళా యి.వీళ్లిద్దరు తెరిచిన పెళ్లిపుస్తకం, మిస్టర్ పెళ్లాం సినిమాలు "నంది అవార్డును" సొంతం చేసుకున్నాయి. ఓ ప్రముఖ దర్శకుడు–మాటల రచయిత కలిసి అద్భుతమైన సినిమాలతో అందరినీ అలరిం చారు. వీరిద్దరి పేర్లు(బాపు–రమణ) తెలుగు భాషలో జంట పదాలుగా నిలిచి హల్చల్ చేస్తున్నాయి. తెలుగు వెండితెరపై హాస్యాన్ని, ఓ గొప్ప స్థాయిని, హుందాని, సెంటిమెంట్ ని సమపాళ్ళలో మేళవించి విజయ భావుట ఎగురవేశారు.వీరి ఆత్మ కథ "కోతికొమ్మచ్చి" అనే పుస్తక రూపంలో వెలువడింది. ఇలా వీరు కథలు రాసినా, సినిమా అల్లినా మాట రాసినా నిర్మాతగా హల్చల్ చేస్తూ సాధారణంగా కనపడే అసాధారణ ప్రతిభామూర్తి. మన మధ్యనే ఉంటూ మనందరినీ రంజింపజేసిన గొప్ప మేధోసంపన్నులు. ఆయన ఊహలు తెలుగు తనంతో ఊపిరి పోసుకున్నాయి. మంచి చెడ్డలు, కష్టాలు, బాధలు, మధ్యతరగతి సగటు జీవితాలు సైతం ఆయన సృష్టించిన కథా వస్తువు లే. వీరు 1995లో రాజ్యలక్ష్మి ఫౌండేషన్ నుండి రాజ్యలక్ష్మి సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. ఇలా సినీ సాహితీ సౌరభాల్ని తెలుగు వారి లోగిళ్ళలో అందంగా విరబూయించిన ముళ్ళపూడి వెంకటరమణ గారు 2011 ఫిబ్రవరి 24న సినీ కళామతల్లి పాదాల చెంతకు చేరారు. వీరు మన మధ్య లేకపోయినప్పటికి వీరి రచనలు మాత్రం ఈ భూమ్యా కాశాలు ఉన్నంతవరకు చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతూనే ఉంటాయి. ఇలా ముళ్ళపూడి వెంకటరమణ గారు అందించిన సాహితీ, సినీ సౌరభాల్ని మన పిల్లలకి, వాళ్లు వాళ్ళ పిల్లలకి అందించడమే మనమంతా ముళ్ళపూడి వారికి సమర్పించే ఘనమైన నివాళి.





పింగళి భాగ్యలక్ష్మి, గుంటూరు
కాలమిస్టు రచయిత్రి (ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) ఫోన్ నెంబర్.9704725609

## పెన్షనర్ల సమస్యలు తీర్చాలని తహసీల్దార్ కు వినతిపత్రం



కోరుట్ల టౌన్ జూన్ 26 (ప్రజామంటలు): ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుట్ల తహసీల్దార్ కు పెన్షనర్లు వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రేగుల భూమానందం, ప్రకాష్ లు మాట్లాడుతూ.... పూర్తి స్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని, 22వ పీఆర్సీ కమీటీ నియమించి ఐఆర్ ప్రకటించాలని అలాగే కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లతో సమానంగా ఆర్డీ లు ప్రకటించాలని రాష్ట్రంలో ఉన్న పెన్షనర్ల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలం




జనగామ జూన్ 26 (ప్రజామంటలు): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జనగామ జిల్లా కలెక్టర్ కార్యలయం ముట్టడి చేశారు. జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.... ప్రభుత్వం దశాబ్ధి ఉత్సవాలు భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని చెప్పి గొప్పగా ప్రకటించిన ఇప్పటికీ రాష్ట్రంలో యూనిఫామ్ రాలేదన్నారు. గురుకులాలు, హస్టల్స్ నిధులు లేవు, నాణ్యమైన భోజనం లేదు, త్రాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు వికాస్, మహేందర్, విఘ్నేష్, సందీప్ పాల్గొన్నారు.

## భరతనాట్యం నృత్యాల్లో రాణిస్తున్న సింగాపూర్ చిన్నారి స్మితాన్విక



హుజురాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర భాష సంస్కృతి శాఖ సౌజన్యంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు భాగంగా సర్వనంది పురస్కారం సింగాపూర్ గ్రామానికి చెందిన పాయిరాల చక్రపాణి పద్మ దంపతుల కుమార్తె ఆ చిన్నారి వయసు తొమ్మిది ఏండ్లు మాత్రమే. కానీ, ఆ చిన్నారి చేసే నాట్యం ఆమెను అత్యున్నత స్థాయిలో నిలబెట్టింది. కూచిపూడి, భరతనాట్యం నృత్యాలు ఎందులోనైనా తన ప్రతిభతో ఆకట్టుకుంటుంది. ఐదేళ్ల వయస్సులో కూచిపూడి నాట్యంతో ఆరంగేట్రం చేసిన చిన్నారి స్మితాన్విక జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో పాల్గొని విజేతగా నిలిచింది. ఈ వయస్సు లోనే బాలనర్తకి, నర్తనబాల లాంటి పలు బిరుదులు సాధించి ఔరా అనిపించింది. ఈ సంధర్బంగా గ్రామానికి చెందిన పలువురు చిన్నారిని అభినందించారు.

## పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



హుజురాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): 20 ఏండ్ల తరువాత బాల్యమిత్రులు ఒక చోట కలుసు కోవడం చెప్పుకోలేని మధుర అనుభవం. ఆదివారం సింగాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో 2002-2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుక రించుకున్నారు. వారు మాట్లా డుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థీ వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ బంద్ విజయవంతం

హుస్నాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట్ మండలాలలో బందు విజయవంతం అయినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల ఆదిత్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అందించి మౌలిక వసతులను కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్ట్ ను వెంటనే భర్తీ చేయాలని అలాగే రాష్ట్రంలో 578 మండలాలకు విద్యాధికారులు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రతి మండలానికి ఒక ఎంఈఓ ను రిక్రూట్మెంట్ చేసి ఖాళీగా ఉన్న



పోస్టులను భర్తీ చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు లేకుండా నడిపిస్తున్న పాఠశాల పైన చర్యలు తీసుకొని, రాష్ట్రంలో వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని అలాగే రాష్ట్రంలో మూసివేసిన 8624 ప్రభుత్వ పాఠశాలలను పునః ప్రారంభించి ప్రభుత్వ విద్యను పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నగర కార్యదర్శి కాంసాని రాకేష్, నగర ఉపాధ్యక్షుడు చెన్నూరి రాజేష్, భీమగోని చరణ్, నగర సంయుక్త కార్యదర్శి అఖిల్, నగర సోషల్ మీడియా కన్వీనర్ చేని మణిదీప్, నగర కార్యవర్గ సభ్యులు ఇలియాజ్, ఇస్రేల్, కోహెడ నాయకులు ఎదుమల రమణారెడ్డి, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు అలవాటు పడకండి

### ఏసిపి వెంకట్ రెడ్డి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



హుజురాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): దేశానికి మూల స్తంభాలు యువత విద్యార్థులేనని వారు మాదకద్రవ్యాలకు అలవాటు పడి బానిసలైతే సమాజం వెనుకడుగు వేస్తుందని హుజురాబాద్ ఏసిపి కోట్ల వెంకటరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని హుజురాబాద్ పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల అలవాటుకు వ్యతిరేకంగా పిల్లలు నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏసిపి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.... సమాజంలో వ్యక్తులకు మాదకద్రవ్యాలు అలవాటుగా మారితే ఆ సమాజం తిరుగమనం దిశగా ప్రయాణిస్తుందని అన్నారు. మత్తు పదార్థాలు అలవాటు వల్ల యువత శారీరక మానసిక సామాజిక అనారోగ్యాలు తలెత్తుతాయని అన్నారు. దేశ భవిష్యత్తుకు అడ్డం పడే మాదకద్రవ్యాల వినియోగాన్ని సామాజిక రుగ్మతగా భావించి ప్రతి ఒక్కరూ పకడ్బందీగా అడ్డుకోవడానికి ప్రయత్నం చేయాలని పోలీసులకు సహకరించాలని అన్నారుయువతలో మొదట మద్యపానం ధూమపానంతో మొదలై సరదాగా మాదకద్రవ్యాలకు బానిసలు అవుతారని తర్వాత అది అలవాటుగా మారుతుందని మత్తులో తామేం చేస్తున్నామో తెలియని పరిస్థితిలో ఉంటారని అన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారని యువత విద్యార్థులు ఈ అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ టౌన్ సి.ఐ. బొల్లం రమేష్, సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు ఆసియా, సత్య ప్రసాద్, సొల్లు సారయ్య, నందం రాములు, సిఆర్పి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చింతల యాదగిరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి



నంగునూర్ జూన్ 26 (ప్రజామంటలు): సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామంలో బేడ బుడగ జంగాల జాతికి చెందిన చింతల యాదగిరికి తెలంగాణలో బిఆర్ఎస్ తరపున ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. నంగునూర్ మండల అధ్యక్షుడు చింతల కృష్ణయ్య ,గౌరవ అధ్యక్షులు వాన రాసి నర్సింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బచ్చన్నపేట మండల అధ్యక్షుడు సిరిపాటి రామదాసు పాల్గొని సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో బేడ బుడగ జంగాలు నష్టపోయారని, తెలంగాణను సాధించుకోవడంలో బేడ బుడగ జంగాల పాత్ర ఉందని అన్నారు. 22 సంవత్సరాల నుండి బిఆర్ఎస్ పార్టీలో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూన్న చింతల యాదగిరి కి ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో 10 లక్షలకు పైగా ఓట్లు కలిగి ఉన్న బేడ బుడగ జంగాలమని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రి హరీష్ రావు, వినోద్ కుమార్ ఈ విషయాన్ని గమనించి తెలంగాణలో ఒకే ఒక సీటు బేడ బుడజంగాలకు కేటాయించాలని కోరారు. మేమందరం ఏకపక్షంగా ఓటు వేసి బిఆర్ఎస్ ప్రభుత్వమును హైట్రిక్ గెలిపించుకుంటామని సభలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరు గ్రామ బేడ బుడిగ జంగాల కుల అధ్యక్షుడు చింతల నరసయ్య, ఉపాధ్యక్షుడు వానరాశి చంద్రమౌళి, కార్యదర్శి వనరాశి సంపత్ సభ్యులు మోతే బాలయ్య, వానరాసి చిన్న హనుమంతు, కడకంచి రమేష్ ,తుర్పాటి రమేష్, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల వెంకటయ్య, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు చింతల కర్ణాకర్ పాల్గొన్నారు.

## బీఎస్పీ ఆధ్వర్యంలో చత్రపతి సాహు మహారాజ్ 149 వ జయంతి



హుస్నాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): బహుజన్ సమాజ్ పార్టీ హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ కేంద్రంలో రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్ధిపేట జిల్లా ఇన్చార్జి దేగల వెంకటేష్ మాట్లాడుతూ సామాజిక న్యాయం అమలుకు 28 ఏళ్ల వయసులోనే తన రాజ్యంలో బ్రాహ్మణ ఎతరులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి సమాన అవకాశాలకు పునాదులు వేసిన మహనీయులు చత్రపతి సాహు మహారాజు విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి విద్యాసంస్కరణ కమిటీ ఏర్పాటు చేసి 1917 లోనే ఉచిత నిర్బంధ విద్యా అమలు చేశారు. అంతేకాకుండా తన రాజ్యంలో కులాంతర మతాంతర వివాహాల చట్టం తీసుకువచ్చి ప్రజాస్వామ్య విలువలకు పునాదులు వేశారు హిందూ పిల్లల జోగిని వ్యవస్థను నిరోధించే చట్టం తెచ్చి వివక్ష అంటరానితరం నిషేధించి కొల్లాపూర్ సంస్థానాన్ని ఎన్నో మిగతా రాజ్యాల కంటే ఆధునిక భావాలతో అభివృద్ధి పదంలో నడిపారని ఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ఎలగందుల శంకర్, ప్రధాన కార్యదర్శి తొందూర్ సాయి తేజ, నియోజకవర్గ కార్యదర్శి మైల తిరుపతి నియోజకవర్గ ఈసి మెంబర్స్ మారపల్లె సుధాకర్, జేరిపోతుల రవీందర్ హుస్నాబాద్ అధ్యక్షుడు దుండ్రా రాంబాబు, మల్లంపల్లి సెక్టార్ అధ్యక్షుడు సంచల విక్రం, సుధాకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పేషంట్ల రద్దీతో కిటకిటలాడిన గాంధీ ఓపీ వార్డు



సికింద్రాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రి ఔట్ పేషంట్ వార్డు సోమవారం పేషంట్ల రద్దీతో కిటకిటలాడింది. సిటీ నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన పేషంట్లు ఓపీ చిట్టీల కోసం క్యూలైన్ లో చాలా సేపు నిలవాల్సి వచ్చింది. వివిద ఆరోగ్య సమస్యలతో వచ్చిన పేషంట్లు ఓపీ డిపార్ట్ మెంట్ లోని ఆయా వైద్య విభాగాలకు వెళ్ళి ట్రీట్మెంట్ పొందగా, మరికొందరు ఇన్పేషంట్లుగా అడ్మిట్ అయ్యారు. గాంధీని మొత్తం 4వేల మంది సందర్శించగా, ఇందులో 1500 మంది కొత్తగా వచ్చిన పేషంట్లు కాగా, మిగిలిన 2500 మంది ఇంతకు ముందు గాంధీకి వచ్చి ట్రీట్మెంట్ తీసుకుంటున్న వారు. ఆదివారం సెలవు కావడంతో ప్రతి సోమవారం ఓపీ రద్దీగానే ఉంటుంది. నాట్కో ట్రస్ట్ సంస్థ స్వాతి కాంతమణి ఆధ్వర్యంలో కో ఆర్డినేటర్లు కృష్ణవేణి, నాగమణి లు పేషంట్లు ఓపీ సేవలు పొందడంలో వారికి తగిన సహాయ, సహాయకారాలు అందచేశారు.

### వానలు షూరు అయ్యాయి.... జాగ్రత్త:

వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏ పూటకు ఆ పూట వంట చేసుకొని వేడి,వేడి ఆహారం తీసుకోవాలని, దోమల వలన డెంగ్యూ లాంటి ప్రాణాంతకమైన వ్యాధి ప్రబలే ప్రమాదం ఉన్నందున ఇంటిలోపలతో పాటు పరసరాల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంచకుండా, ఎప్పుడు డ్రై గా ఉంచాలన్నారు. వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# విద్యార్థి సమగ్ర వివరాలు నమోదు చేయాలి

### జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి




జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): విద్యార్థుల సమగ్ర వివరాలను ఆన్ లైన్ చేయాలని జగిత్యాల జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి అన్నారు. విద్యార్థి, పాఠశాలకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆన్ లైన్ లో నమోదు కోసం ప్రభుత్వం అందించిన 543 ట్యాబ్ లను ఉపాధ్యాయులకు సోమవారం జిల్లా విద్యాధికారి అందించారు. జగిత్యాల జిల్లాలోని టీచర్ ట్రైనింగ్ సెంటర్ లో జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రభుత్వం 543 ట్యాబ్ లను సరఫరా చేసినదన్నారు. ఈ కార్యక్రమాన్ని 26 నుండి 27 రెండు విడతలగా జిల్లాలోని ఎంపిక చేసిన పిఎస్, యుపిఎస్ పాఠశాలలకు పంపిణీ ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు 270 ట్యాబ్ లను జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన టీచర్స్ కి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా, ప్లానింగ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, సంజీవ్, దేవేందర్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.



భీమదేవరపల్లి మండలం రసూల్ పల్లి గ్రామంలో పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న... గడపగడప కు కాంగ్రెస్... కార్యక్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదవాడికి లబ్ది చేకూరేలా పథకాల అమలు గూర్చి తెలియజేసిన ప్రవీణ్ రెడ్డి

## బాధితులకు సత్వర న్యాయం గ్రీవెన్స్ డే లక్ష్యం : ఎస్పీ ఎగ్గడి భాస్కర్



జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): పోలీసులను ఆశ్రయించే బాధితులు అనేక రకాల సమస్యలతో వస్తారని, సత్వర న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవడమే గ్రీవెన్స్ డే ముఖ్య లక్ష్యమని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 21 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భూ సమస్యల విషయంలో అన్ని కోణాలలో సమగ్రంగా విచారణ చేసి, క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకొని అందుకు అనుగుణంగా బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

## జగిత్యాల జిల్లాలో కొత్తగా మరో మండలం

జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లాలో కొత్తగా మరో మండలం బండలింగాపూర్ మండలం ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ. మెట్ పల్లి మండలంలోని పది గ్రామాలతో బండలింగాపూర్ మండలం ప్రతిపాదన పక్షం రోజుల్లోగా అభ్యంతరాలు, వినతులకు గడువు ఇచ్చిన ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూశాఖ.

## జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లో 17 ఏళ్ల మెడికో ఆమిర్ ఖాన్ కు తీవ్ర అస్వస్థత

జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): మెడికల్ కాలేజ్ లో మొదటి సంవత్సరం చదువుతున్న రాజస్థాన్ కు చెందిన ఆమిర్ ఖాన్ (17) నిన్న సాయంత్రం వసతి గృహంలో చెమటలు పట్టి ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. గమనించిన తోటి విద్యార్థులు జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.మెరుగైనచికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

## డీడీఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్గా కృష్ణారెడ్డి



సికింద్రాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడైన డాక్టర్ ఎన్. కృష్ణారెడ్డి దుర్గా బాయ్ దేశ్ముఖ్ ఆస్పత్రి మెడికల్ సూపరిం టెండెంట్గా నియమితు లయ్యారు. ఈమేరకు మేనేజ్ మెంట్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన కృష్ణారెడ్డి 1978 ప్రభుత్వ వైద్యునిగా నియ మితులై, కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మరియు అడిషనల్ డైరక్టర్ గా 2007లో పదవీ విరమణ పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘంలో అధ్యక్ష,కార్యదర్శి పదవులతో పాటు ఉస్మా నియా అలుమ్నీ అసోషియేషన్, ఐఎంఏ బిల్డింగ్ ట్రస్ట్ ఛైర్మన్గా వ్యవహ రించారు. ప్రస్థుతం తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ మెంబర్, ఉస్మాని యా అలుమ్నీ ట్రస్ట్ ఛైర్మన్ తోపాటు పలు అడ్మినిస్ట్రేషన్ పదవుల్లో కొన సాగుతున్నారు. డీడీహెచ్ ఆస్పత్రి మేనేజ్మెంట్ ఆయన సేవలను గుర్తి ంచి మెడికల్ సూపరింటెండెంట్గా నియమించింది. కృష్ణారెడ్డి మా ట్లాడుతు రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించి దుర్గాబా య్ దేశ్ముఖ్ ఆశలు, ఆశయాల సాధనకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.కృష్ణారెడ్డి నియామకం పైపలువురువైద్యులుహర్షంవ్యక్తం చేశారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ శైలజ



సికింద్రాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ లోని అంబర్ నగర్ గాంధీ విగ్రహం ప్రాంతంలో రూ. 44 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కొత్త సీసీ రోడ్ల పనులను కార్పొరేటర్ కంది శైలజ సోమవారం పర్యటించి, పరిశీలించారు. కొత్తగా రోడ్లు వేసే సమయంలోనే స్థానికులు తమ మంచినీటి, డ్రైనేజీ పైప్ లైన్లను సరిచూసుకోవాలని కోరారు. ప్రస్తుత వానకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమల వలన ప్రమాదకరమైన డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఇంటితో పాటు పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎమ్సీ ఏఈ శశి, వాటర్ వర్క్స్ ఏఈ ప్రియాంక, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, పాకసాయి, జగదీశ్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

## దళితబందులో ఎస్సీ ఉపకులాలకు 40 శాతం కేటాయించాలి

### ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి డిమాండ్



భీమదేవరపల్లి జూన్ 26 (ప్రజామంటలు): ఎస్సీ ఉపకులాలకు దళితబందు పథకంలో 40 శాతం కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గడ్డం చిరంజీవి, ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితబందు మొదటి విడతలో 59 దళిత ఉప కులాలలో రెండు కులాలకే న్యాయం జరిగిందనీ, మిగతా వెనుకబడిన మోచి, హెూలియ దాసరి, చిందు, దక్కలి, మాష్టిన్, గోసంగి, మాల జంగం, మాలదాసరి, బైండ్ల, మాదసి కురువ, గోసంగి, సమగర, బేడ బుడ్గ జంగం, మాంగ్, మహర్, మిత అయ్యాల్వర్ తదితర 57 ఉపకులాలకు ఒక్కశాతం కూడా అందలేదని తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసారు. రెండవ విడత దళితబంధులో ఉప కులాలకు ప్రతి నియోజకవర్గం లో 40 శాతం కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా లక్ష్మణ్, డాకూరి సమ్మయ్య, సుంచు మల్లయ్య, హరిబాబు, సతీష్, వేణు, రాంబాబు, గజ్వేలి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

### డిపో మేనేజర్ అర్పిత



హుజరాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): హుజురాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిలో నేడు మంగళవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించబడు తుందని డిపో మేనేజర్ అర్పిత తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9:30 నుండి సాయంత్రం మూడు గంటల వరకు నిర్వహించబడుతుందని , దీనిని ఆర్టీసీ కార్మి కులు వారి బంధువులు, స్నేహితులు తదితరులు రక్తదానం చేయాలని దీనిలో పాల్గొని విజయవంతం చేయాలని డిపో మేనేజర్ కోరారు.

## ఏబివిపి ఆధ్వర్యంలో పాఠశాలల బంద్



మహాదేవపూర్ జూన్ 26 (ప్రజామంటలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ నగర శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు బంద్ చేయడం జరిగింది మహాదేవపూర్ నగర కార్యదర్శి గూగుల్ కృష్ణ మాట్లాడుతూ.... తెలంగాణ వచ్చి దశాబ్ది కాలమైన ప్రాథమిక విద్యకు విద్యార్థులు దూరమైపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక ఎంతో మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అదేవిధంగా మూసివేసిన పాఠశాలలు పున ప్రారంభించాలని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఏబీవీపీ తగిన బుద్ధి చెబుతుందని తెలియజేశారు. పాఠశాలల బందుకు సహకరించిన విద్యాసంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు జోడు వెంకటేష్, రవితేజ, అనిల్ పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారులతో యాసంగి పంటపై సమీక్ష



చొప్పదండి జూన్ 26 (ప్రజామంటలు): మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు యాసంగిలో పంటల సాగు గురించి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిలుక రవీందర్ అధ్యక్షతన వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం జరిగినది. కార్యక్రమాన్ని ఉద్దేశించి రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వము నమస్తే రైతుల క్షేమం గురించి తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని అందులో భాగంగా రైతు బీమా రైతు బంధు పథకాలు ముఖ్యమని. మండలంలో ప్రస్తుతం 12వేల మందికి సుమారు 12 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. 2500 పత్తి పంట వేశారని, సుమారు 117 మంది రైతు బీమా పథకం క్రింద 5లక్షల రూపాయలు లబ్ధి చేకూర్చడం జరిగింది.. రభి కాలంలో చాలామంది రైతులు నష్టపోయినందున ప్రస్తుతం యాసంగిలో వ్యవసాయ అధికారులు రైతులకు చేదోడు వాదోడుగా ఉండి వారికి పంటల గురించి ఎరువుల గురించి తెలుపుచూ చేదోడు వాదోడుగా ఉండాలని కోరారు. ఒకే రకం పంటలు కాకుండా వివిధ రకాల పంటలు వేసి పర్యావరణ సమతుల్యానికి వాడు పడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, వ్యవసాయ అధికారి వంశీకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు టీ. సాయికుమార్, కె. ప్రసన్న కుమార్, కె. రాజశేఖర్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ తగాదాలతో ప్రత్యర్థుల దాడిలో ముగ్గురు మృతి

రెబ్బెన జూన్ 26 (ప్రజామంటలు): కుమురంభీం జిల్లాలో భూతగాదాలు భగ్గుమన్నాయి. జిల్లాలోని రెబ్బన మండలం జక్కులపల్లిలో భూతగాదాల నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ క్రమంలో మాటమాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకొనే పరిస్థితికి వచ్చింది. ఘర్షణలో ప్రత్యర్థులు గొడ్డళ్లు, కత్తులతో దాడి చేయగా ముగ్గురు మృతి చెందారు. మృతి చెందిన వారిలో ఒక మహిళ కూడా ఉన్నారు. దాడిలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వారికి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. సుమారు 15 మంది వరకు దాడికి పాల్పడినట్లు బాధితులు చెబుతున్నారు.

# పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

### సంఘ అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథ శర్మ, బండయ్య

(రామ కిష్టయ్య సంగన భట్ల)



ధర్మపురి జూన్ 26 (ప్రజామంటలు): విశ్రాంత ఉద్యోగులైన పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని మనవి చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేరున వినతి పత్రాన్ని ధర్మపురి మండల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ గణేశ్ లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ శర్మ, బండయ్య మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్రములో అత్యంత పెద్ద సంఖ్యలో సభ్యత్వము కలిగియున్న పెన్షనర్ల సంఘం 1983 లో స్థాపించ బడినదని, రాష్ట్రం మొత్తములో సుమారు 2,86,000 మంది ప్రభుత్వ పెన్షనర్లు వుండగా తమ సంఘములోనే 2,26,000 మంది పెన్షనర్లు సభ్యులుగా వున్నారని, రాష్ట్ర మంత టా విస్త రించ బడి 33 జిల్లాశాఖలు, 262 మండల శాఖలు కలిగివున్న ఏకైక సంఘం హైదరాబాదులో స్వంత రాష్ట్ర సంఘ భవనముతో పాటు జిల్లా మండల శాఖలలో వంద స్వంత భవనాలు కలిగివుండి, నిత్యము పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తూ ఎన్నో. ప్రజాహిత సామాజిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్న ఏకైక పెన్షనర్ల సంఘమని వివరించారు. పెన్షనర్లు వివిధ ఆనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో లక్షల రూపాయల బిల్లులు చెల్లించవలసి వస్తున్నందున 1వ పి.ఆర్.సి. సిఫారసులకు అనుగుణంగా పెన్షనర్ల మూల వేతనము నుండి 1% మినహాయించి పూర్తి స్థాయిలో ఈహెచ్ఎస్ అమలు పరచాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల నుండి కమ్యుటేషన్ ద్వారా పొందిన మొత్తమును 15 సం.ల (180 వాయిదాలలో) వరకు మినహాయించ బడుచున్నదని, ప్రస్తుత వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణము, జీవన వ్యయము తదితర అంశాలను పరిగణలోనికి తీసుకొని అట్టి రికవరీ కాలాన్ని 12 సం.లకు తగ్గించుటకు విజ్ఞప్తి చేశారు. 2వ పి.ఆర్.సి.ని నియమించి 1-7-2023 నుండి అమలు పరచుట మరియు ఐ.ఆర్. చెల్లించుట,పెండింగ్ రెండు డి.ఆర్.లు చెల్లిచుట. నెలల తరబడి ఇకుబేర్ లో పెండింగు లో వున్న బిల్లులను వెంట వెంటనే చెల్లించుట, ప్రతి నెల మొదటి తేదిన పెన్షన్లు చెల్లించుట, 398 రూపాయల క్రింద నియమకాలు జరిగిన స్పెషల్ ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంటు ఇచ్చుట.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం లో 85% పెన్షనర్లు సభ్యులుగా వున్నందు వలన టిఎస్ జిఆర్ఈఏ సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఇచ్చుట, జీవన వ్యయము విపరీతంగా పెరిగినందువలన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల కనిష్ఠ పెన్షన్ ను రూ. 30,000/- ఇతర సమస్యలపై పెన్షనర్ల సంఘంతో ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్చలు జరిపి పరిష్కరించుటకు తగు చర్యలు కొనుట తదితర అంశాల గురించి వినతి పత్రం సమర్పించామని, వెంటనే సహృదయంతో, సానుభూతితో పరిశీలించి, సానుకూల నిర్ణయాలు వెలువరిస్తారని ఆశిస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షవర్ల అందరి పక్షాన కృతజ్ఞతలు సమర్పిస్తున్నామని విశ్వనాథ శర్మ, బండయ్య విజ్ఞప్తి చేశారు. సంఘ జిల్లా బాధ్యులు అలువాల దత్తాత్రి, వజీర్, అఫ్జల్, రాంకిషన్, అంబరీష్, శంకర్, రాజేశ్వర్, రవి, రాజయ్య గుండ య్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా నమోదు సవరణలు తొలగింపులపై అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్



జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): ఆరోగ్యవంతమైన ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. ఎన్నికల కమీషన్ అధికారులు హైదరాబాద్ లో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఓటరు జాబితాలో లేవనెత్తిన అభ్యంతరాలు, సలహాలు, సూచనల మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులు వంటి అంశాలపై దిశా నిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని అన్నారు. 18, 19 ఏళ్ళ వయసు గల పౌరులందరి పేర్లను నమోదు చేయడం, 20 నుండి 29 వయసు కలిగిన వారి పేర్ల నమోదు లో కొంత గ్యాప్ ఉన్నట్లు ఎన్నికల కమీషన్ గుర్తించిందని, వారందరి పేర్లు జాబితాలో ఉండేవిధంగా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. అర్హత గల ఏ ఒక్కరి పేరు కూడా తప్పి పోకుండా ఓటరు జాబితాలో నమోదు చేసే విధంగా స్థానిక సర్పంచుల సహకారం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మరణించిన, శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లను ఎన్నికల నియమావళి మేరకు, అవసరమైన డాక్యు మెంట్ల జారీచేయాలని, అన్ని పూర్తయిన తర్వాతనే తొలగింపులు చేపట్టాలని అన్నారు. మొదటి సారి నమోదు అయ్యే విద్యా సంస్థల యాజమాన్యాల సహకారం తీసుకోవాలని అన్నారు. దివ్యాంగుల ఓటర్ల వివరాలు సేకరించాలని, ఫించన్ల మంజూరు, ఉపాధి హామీ సంఘాలు వంటి జాబితాలను ఆయా అధికారుల సహకారంతో సేకరించాలని, ప్రతీ ఒక్క దివ్యాంగుల పేరు తప్పని సరిగా ఓటరుగా నమోదు అయ్యిందా లేదా పరిశీలించికొని నమోదు చేయాలని సూచించారు. 80 ఏళ్ళ వయసు పైబడిన వృద్దుల ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. ఈఆర్ఓ, ఏఈఆర్ఓ ల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, అదేవిధంగా ఆయా గ్రామాలలో ఉన్న ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు వంటి అంశాలను పరిశీలించాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులు, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, అవసరమైన వారి సేవలు తీసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కమీషన్ జారీచేసే ప్రతీ ఉత్తర్వులను, సర్క్యులర్ లను చదవాలని అన్నారు. ప్రతీ అంశానికి సంబందించిన పూర్తి వివరాలతో ఫైళ్ళను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, మంద మకరంద, ఆర్డీఓ వినోద్ కుమార్, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నివారణ సందర్భంగా రన్



జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో ఉదయం ఏడు గంటలకు రన్ ప్రారంభమైంది .రన్ ప్రారంభం కు ముందు వక్త లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్ ,డీఎస్పి ప్రకాష్ ,సామాజిక కార్యకర్త ఫ్రీ లాంన్స్ జర్నలిస్టు తవుటు రామచంద్రం ,హరి అశోక్ కుమార్, ఎక్సైజ్ సి ఐ ప్రభాకర్ రెడ్డి ,అధికారులు, వివిధ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా తవుటు రామచంద్ర0 మాట్లాడుతు యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ నిండు జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని, ఈ మత్తు పదార్థాల వాడకాన్ని కచ్చితంగా అణచివేయకపోతే రానున్న తరాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ మత్తు పదార్థాలను కూకటివేలతో సహా పెకిలించి వేయకపోతే రానున్న తరాలకు పెనుమపు పొంచి ఉంటుందనేది అక్షర సత్యం. రంగంలోనికి ప్రత్యేక బలగాలని దింపి, మాధ క ద్రవ్యాల ఆట కట్టించాలని అన్నారు.

## 24 గంటల్లో క్షమాపణ చెప్పాలి

- లేదంటే ముదిరాజుల తడాఖా చూపిస్తాం
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు మేకల సారంగపాణి
- పార్శిగుట్ట చౌరస్తాలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



సికింద్రాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): బాధ్యతగల పదవిలో ఉంటూ ఓ వీడియో జర్నలిస్టును దుర్భాషలాడి అతని కెమెరా లాక్కొని అతనిపై దాడికి పాల్పడడమే కాకుండా సభ్య సమాజం తలదించుకునేలా ముదిరాజ్ కులాన్ని దుర్భాషలాడిన ఎమ్మెల్సీ పాడే కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించాలని, 24 గంటల్లో అతనిపై సీఎం కేసీఆర్ చర్య తీసుకోకపోతే ముదిరాజుల తడాఖా ఏమిటో? రాష్ట్రవ్యాప్తంగా చూపిస్తామని ముదిరాజ్ సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. సోమవారం పార్సిగుట్ట చౌరస్తాలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కనకయ్య ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని ముదిరాజు నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అన్ని రాజకీయ పార్టీలకు ముదిరాజ్ సంఘం నాయకులు ఈ ధర్నాలో పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా వారాసిగూడ పోలీస్ స్టేషన్ లో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి పై లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. కౌశిక్ రెడ్డి పై వెంటనే చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. అనంతరం రాష్ట్ర నాయకుడు మేకల సారంగపాణి మాట్లాడుతూ... బాధ్యత గల పదవిలో ఉంటూ ఒక వీడియో జర్నలిస్టును కిడ్నాప్ చేసి అతని హింసించడం కులాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడడం సబబు కాదని అన్నారు అధికార మదంతో వీర్రవీగుతున్న కౌశిక్ రెడ్డి పై చట్టపరంగా చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. ఇంకా ఈ ఆందోళన కార్యక్రమంలో పలువురు నాయకులు కౌశిక్ రెడ్డి పై తీరుపై విరుచుకుపడ్డారు. కౌశిక్ రెడ్డిని బండ బూతులు తిడుతూ అతని బొమ్మను చెప్పులతో కొడుతూ నిరసన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సతీష్, రాజ హనుమంతు, కనకయ్య, మధు, శ్యామ్, ఓములు, క్రాంతి, రాజ్, వెంకటేష్, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు.

## ఈవీఎం ఫస్ట్ లెవెల్ చెకింగ్ కొనసాగుతున్న ప్రక్రియ పరిశీలన



జనగామ జూన్ 26 (ప్రజామంటలు): జనగామ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ఈవీఎం గోడౌన్ లో కొనసాగుతున్న ఓటింగ్ మిషన్ ఈవీఎం, వివి ప్యాట్స్ ,కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్, మొదటి స్థాయి తనిఖీలు ఈసీఐఎల్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది సమక్షంలో జరుగుతున్నాయన్నాని జనగామ జిల్లా కలక్టర్ సి.హెచ్.శివలింగయ్య అన్నారు.జులై రెండు వరకు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట ఉప ఎన్నికల అధికారి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావెల రవి, బోట్ల శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, తిప్పర్తి సోమయ్య, జోగు ప్రకాష్, వెంకట్ రెడ్డి, జయ కుమార్, తదితరులు ఉన్నారు.

## ప్రతి విద్యార్థి ధారాళంగా చదవేలా చూడాలి

### ఎంఈఓ ఈసరి రవీందర్



ఎల్కతుర్తి జూన్ 26 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండల పరిధిలోని దామెర గ్రామములో సోమవారం మండల విద్యాధికారి ఈ. రవీందర్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న పాఠశాలలో పఠనోత్సవంలో భాగంగా హాజరైనారు. ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులకు పఠనోత్సవం ఎంత గానో దోహదపడుతుంద చదవడం రాయడం ధారాళంగా మాట్లాడడం అలవాటు చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమములో విద్యాధికారి ఈసరి రవిందర్ తో పాటు మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి ఎల్. మనోహర్ నాయక్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఒకటి నుండ్డి పదవ తరగతి విద్యనభ్యసించే విద్యార్థులు ధారాళంగా చదవటం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం 6 రోజులపాటు పరిషత్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సాంబ శివా రెడ్డి, రామాంజనేయులు, బొల్లం సాల్మన్, సిఆర్పీ రవికుమార్ తో పాటు పాఠశాల చేర్మెన్ సాతురి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



హుజరాబాద్ జూన్ 26 (ప్రజా మంటలు): హుజురాబాద్ మం డలం సిరిసపల్లి గ్రామ శివారులో పొలాలకు పెంటను తీసుకొని వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ చిత్తారి రాములు (55) మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు . ప్రమాద సంఘటన సమాచారం అందగానే హుజురాబాద్ ఎస్సై ఎండి ఆసిఫ్ ఘటన స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలి

### కేతిరి వెంకట నరసింహారెడ్డి



హుజురాబాద్ జూన్ 26 (ప్రజామంటలు): పిల్లల్లో అభ్యాసనం పట్ల ఆసక్తిని పెంచి దారళంగా చదివేట్టు ప్రతి ఉపాధ్యాయుడు శక్తివంచన లేకుండా కృషి చేయాలని హుజురాబాద్ మండల విద్యాధికారి కేతిరి వెంకట నర సింహారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం హుజూరాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో జులై 31 వరకు జరుగబోవు పఠనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల్లో అభ్యాసనం పట్ల ఆసక్తిని పెంచడానికి పఠణోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వూరుగొండ సత్య ప్రసాద్, ఉపాధ్యాయులు జూపెల్లి జగదీశ్వర్ రావు, జతనం వెంకట నర్సయ్య, చెవులపల్లి జయప్రద, కముటం రవీందర్, జక్కు కృష్ణమూర్తి గౌడ్, కరుణాకర్ రెడ్డి, బుక్క నాగమణి, తర్మీమ్ షాహీన్, భాగ్య, శ్రీదేవి, సి ఆర్ పి రంగు దామోదరా చారి, సిబ్బంది రఫీ, సుల్తానా, రాజేశ్వరి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ మకరంద



జగిత్యాల జూన్ 26 (ప్రజామంటలు): ప్రజల సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మంద మకరంద అన్నారు. సోమవారం రోజున సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి పలు సమస్యలపై వచ్చిన అర్జీ దారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. భూ సంబంధం, ఉపాధి, ప్రజారోగ్యం పారిశుధ్యం, తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను ఆయా అదికారులకు అందజేస్తూ, సమస్యను పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజావాణి నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. వివిధ సమస్యలపై 45 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ ప్రజావాణి లో కోరుట్ల ఆర్డీఓ వినోద్ కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక అభివృద్ధికే రైతుబంధు పథకం

### సీఎం కేసీఆర్ కు రుణపడి ఉంటాం



చిగురుమామిడి జూన్ 26 (ప్రజామంటలు): రైతుల ఆర్థికఅభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోటే, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి పంటకు రైతుబంధును అందజేస్తున్నారని చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుబంధు పథకంలో భాగంగా ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎకరానికి 5 వేల చొప్పున విడతలవారీగా వారి ఖాతాలలో జమ చేస్తున్నారన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన రైతు బంధు పథకాన్ని వినియోగించుకుని తెలంగాణ రైతాంగం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో దోహదపడుతుంది అన్నారు. చిగురుమామిడి సింగిల్ విండో లో విత్తనాలు,ఎరువులు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలియజేసారు. ఈ రబీ సీజన్లో ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో 3,604 రైతుల ద్వారా 12 సెంటర్లలో 1,78 వేల క్వింటాల్ల వరి ధాన్యం సేకరించి పూర్తిస్థాయిలో చెల్లింపులు కూడా చేయడం జరిగిందని తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సతీష్ కుమార్ సహకారంతో పూర్తి చేయడం జరిగిందని తెలుపుతూ స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు, రైతులకు మరియు కార్యక్రమంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కూడా పేరుపేరునా చైర్మన్ జంగా రమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైన పఠనోత్సవం

# నోటు పుస్తకాల వితరణ చేసిన హెచ్.ఎం. లీలాబాయి



వేలేరు జూన్ 26 (ప్రజామంటలు): మండల వ్యాప్తంగా వివిధగ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల విద్యాశాఖ ఆదేశం మేరకు విద్యార్థులకు చదివే నైపుణ్య పెంపుదలకు పఠనోత్సవం కార్యక్రమం ప్రారంభమైంది. ఎంపిపిఎస్ వేలేరు పాఠశాలలో హెచ్.ఎం. లీలాబాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి మహేష్ నాయక్, జెడ్పిహెచెస్ వేలేరు కాంప్లెక్స్ హెచ్ ఎం నాగకుమారి పాల్గొని మాట్లాడుతూ.... పఠనోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా విద్యార్థులలో పఠనా నైపుణ్యము పెంపొందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం హెచ్ఎం లీలాబాయి పాఠశాల విద్యార్థులకు అందరికి ఒక్కక్కరికి 6 నోటు పుస్తకాలు తన స్వంత ఖర్చుతో వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సిఆర్పి మొగిలిచెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ వినతి



మెట్పల్లి జూన్ 26 (ప్రజామంటలు): మెట్ పల్లి ఎమ్మార్వో కార్యాలయంలో తెలంగాణ స్టేట్ గౌట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ మెట్పల్లి వారి ఆధ్వర్యంలో ఎమ్మార్వో సత్యనారాయణ కి వినతి పత్రం అందించారు. ఎంప్లాయిస్ మెట్ పల్లి అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ రాజేశ్వర్రావు మాట్లాడుతూ.... విశ్రాంతి తెలంగాణ స్టేట్ గౌట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేషన్ వారి ఆదేశాల మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నట్టు మెట్ పల్లి అసోసియేషన్ సభ్యులు 150 మంది కలిసి తాహసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్ రాజేశ్వరరావు, సెక్రటరీ సి. నందగోపాల్, క్యాషియర్ చిన్నయ్య, దువ్వ నరసయ్య, కట్టుకం గంగారాం, గంద్ర ఆనందరావు, డి. గంగారాం తదితర రిటైర్డ్ ఉద్యోగ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 3.5 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి

### కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు సాగునీరు

### లూలూ గ్రూప్ కార్యకలపాలను ప్రారంభించిన కెటిఆర్

హైదరాబాద్,జూన్26 : రాష్ట్రం ఏర్పడిన తర్వాత తలసరి ఆదాయం రెట్టింపయిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 3.5 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతున్నదని చెప్పారు. వరిసాగులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్లో మంత్రి కేటీఆర్ సమక్షంలో లూలూ గ్రూప్ రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లూలూ సంస్థ పెట్టుబడులతో టూరిజం పెరుగుతుందని భావిస్తున్నా మన్నారు. తెలంగాణలో పండే పత్తి దేశంలోనే అత్యున్నతమైనదని చెప్పారు. చేపల ఉత్పత్తిలోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో అతిపెద్ద ఆక్వా హబ్ సిద్ధమవు తున్నదని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకు పోతున్నదని వెల్లడించారు. రూ.300 కోట్లతో మెగా డెయిరీ లాంట్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఐదేండ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 10 వేల ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణలో రూ.3500 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు లూలూ గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ చెప్పారు. ఫుడ్ప్రాసెసింగ్ అండ్ ఎక్స్పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటుచేయబోతున్నామని వెల్లడించారు. రూ.3 వేలకోట్ల పెట్టుబడితో హైదరాబాద్లో షాపింగ్మాల్ ఏర్పాటుచేస్తామన్నారు. ఇప్పటికే లూలూ మాల్కు సంబంధించి 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

# ఇక దేశమంతా తెలంగాణ మోడల్

### ఇక దేశమంతా తెలంగాణ మోడల్

### కెసిఆర్ పానల కోసం దేశం ఎదురుచూపు

### మూడోసారి విజయం సాధించబోతున్నాం

### మంత్రి వేముల ప్రశాంతరెడ్డి వెల్లడి



నిజామాబాద్,జూన్ 26 : తెలంగాణ పాలనా విధానం ఇతరరాష్ట్రాలకు, దేశానికి ఆదర్శంగా నిలిచింది. మంత్రి వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. అందుకే సరిహద్దు రాష్ట్రాల్లో బిఆర్ఎస్ పాలన రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఆయా రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ పాలన బాగా తెలుసున్ని అన్నారు. ఎవరు మెరుగైన పాలన అందించగలరో ప్రజలకు తెలుసనీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ లాంటి సమర్థులు ప్రతిపక్షంలో ఎవరూ లేరని అన్నారు. తెలంగాణలో అధికారం కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతు న్నాయనీ, అయితే దేశవ్యాప్తంగా 20కి పైగా రాష్ట్రాల్లో తాము అధికారంలో ఉన్నా దక్షిణాది రాష్ట్రాలకు సమానమైన, మెరుగైన పాలనా నమూనాను ఎక్కడా ఆ రెండు పార్టీలు అందించడం లేదన్నారు. తెలంగాణ మోడల్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి నమూనాపై చర్చ జరుగుతోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు తెలంగాణలో విజయం సాధించి వరుసగా మూడోసారి కెసిఆర్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజ్యం సాధిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తెలంగాణ రాష్ట్ర సమితి గత అక్టోబర్ లో జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. దేశంలో బలమైన పార్టీగా అవతరించింది. 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీపై పోటీపడతామని కూడా అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉమ్మడి ఎజెండాను చూపే రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకునే అవకాశాలను పార్టీ అధినేత కెసిఆర్ పరిశీలిస్తున్నారని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటంతో పాటు దేశం ముందున్న ప్రధాన సమస్యలపైనే తమ ఆరాటం అన్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందనీ, గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలుచుకోవడమే లక్ష్యంగా ప్రయత్నిస్తుందని అన్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తెలంగాణ రాష్ట్ర సమితి మరోమారు విజయం సాధించడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివరలో జరగనున్నాయి. కాంగ్రెస్, బిజెపిలు జాతీయ పార్టీలు అయినా దేశానికి వాటివల్ల ఒకిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ లేదా బీజేపీ ప్రధాన కూటమిగా ఉన్న ఏ ఫ్రంట్ అయినా విజయం సాధించదని ఆయన పునరుద్ఘాటించారు. ఉపాధి కల్పన, రైతులకు సంపద, సాగునీరు, గ్రామీణ జీవనోపాధి వంటి సమస్యలపై ఈ పార్టీలకు స్పష్టత లేదన్నారు. రెండు ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్లు దేశాన్ని ఏలినా నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత 75 ఏళ్లలో దేశం వెనుకబడిపోతూనే ఉందని, పురోగతి సాధించకపోవడానికి కాంగ్రెస్, బీజేపీలే కారణమన్నారు. మరోవైపు తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ అతి తక్కువ కాలంలోనే అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పురోగతి సాధించిందని అన్నారు.

# మహారాష్ట్రకు బయలుదేరిన కెసిఆర్

### మహారాష్ట్రకు బయలుదేరిన కెసిఆర్

### భారీ కాన్వాయ్తో మంత్రులతో కలసి పయనం

హైదరాబాద్,జూన్26 :ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనకు బయల్దేరారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా హైదరాబాద్లోని ప్రగతి భవన్ నుంచి రోడ్డు మార్గాన రెండు ప్రత్యేక బస్సులు, 600 కార్లతో కూడిన భారీ కాన్వాయ్తో బయలుదేశారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయ కులు ఉన్నారు. మధ్యాహ్నం మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లా ఒమర్గాకు చేరుకుంటారు. ఒమర్గాలో మధ్యాహ్న భోజనం చేసి, అక్కడి నుంచి సాయంత్రం 4.30కి సోలాపూర్ బయలుదేరుతారు. రాత్రి సోలాపూర్లోనే బస చేస్తారు. మంగళవారం ఉదయం 8 గంటలకు సోలాపూర్ నుంచి పండరీపురం చేరుకుంటారు. పండరీపురంలోని విఠోభారుక్మిణి మందిర్లో సీఎం కేసీఆర్, మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తరువాత సోలాపూర్ జిల్లా సర్కోలి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సభలోనే సోలాపూర్ జిల్లాలో ప్రముఖ నాయకుడు భగీరథ్ బాల్కే సహా పలువురు నేతలు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్లో చేరనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అక్కడి నుంచి ధారాశివ్ జిల్లాలోని శక్తిపీఠమైన తుల్జాభవానీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హైదరాబాద్కు పయనమవుతారు. సీఎం కేసీఆర్ పర్యటనకు మహారాష్ట్రలోని బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో కేసీఆర్ 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి భారీ కార్ల ర్యాలీని చేపట్టి యావత్ దేశ దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం మహారాష్ట్రలో బీఆర్ఎస్ విజృంభిస్తున్నది. సీఎం కేసీఆర్ ఇచ్చిన 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నది. ఈ సమయంలో నాటి చలో ఢిల్లీని తలపిస్తూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులతో కేసీఆర్ మహారాష్ట్రలో పర్యటించేందుకు రోడ్డుమార్గాన్ని ఎంచుకోవటం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది.

# కుష్టు వ్యాధి నిర్ధారణ కార్యక్రమం



### ఆరోగ్య కార్యకర్తలకు సహకరించండి.

### కుష్టు వ్యాధి పై అప్రమత్తంగా ఉండండి.

### జిల్లా కలెక్టర్ డిల్లీరావు.

విజయవాడ,జూన్26 :ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో చికిత్స అందించాలని, అంగవైకల్యం నివారించడంలో జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు పేర్కొన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జూలై 16వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా కేంద్ర రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా కుష్టు వ్యాధి పై ప్రచురించిన అవగాహన పోస్టర్లను, కరపత్రాలను సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డిల్లీరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా సర్వే ద్వారా లెప్రసీ కేసుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ సహకారించి శాశ్వత లోపాలు, అంగవైకల్య బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుండి ప్రారంభమైన వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లతో ఇంటింటా నిర్వహించే సర్వేలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. తొలి దశ లోనే బహుళ ఔషధ చికిత్స అందించడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చున్నారు. కుష్టు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రీ అను బాక్టీరియా వలన వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం, దగ్గడం వలన గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. చర్మం పై స్పర్శ లేని మచ్చలు, అరిచేతులు, అరి కాళ్ళలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించ లేకపోవడం వంటి లక్షణాలను కుష్టు వ్యాధిగా గుర్తించవచ్చని అన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్న యెడల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి పరీక్ష చేయించాలన్నారు. ప్రత్యేక మెడికల్ విభాగం ఉన్న వైద్య ఆరోగ్య సంస్థ నగరపాలక సంస్థ పరిధిలో అన్ని వార్డులలోను సర్వే నిర్వహించి అనుమానితులను సంబంధిత ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహించేటప్పుడు ఎక్కువగా నమోదు అయ్యే ప్రాంతాల వారిగాను, కమ్యూనిటీ వారిగాను పరిశీలించికుని ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను అరికట్టవచ్చునన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో కుష్టు వ్యాధి చికిత్స ఉచితంగా లభిస్తుందనే సమాచారాన్ని ప్రజలందరికి తెలియజేయాలన్నారు. కుష్టు వ్యాధిని జిల్లాలో సమూలంగా నిర్మూలించి కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు వైద్యాధికారులను కోరారు. ˉోస్టర్ విడుదల కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. పి సంతప్ కుమార్, డిఆర్వో కె. మోహన్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. యం సుహాసిని, జిల్లా లెప్రసీ, టిబి, ఎయిడ్స్ ప్రోగ్రామ్ అధికారి డా. ఉషారాణి, లేప్రా ఎన్జివో స్టేట్ కో-ఆర్డినేటర్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

# 19మండలాలలోఓ పోడు పట్టాలు పంపిణీ

నిజామాబాద్,జూన్ 26 : నిజామాబాద్ జిల్లాలో 19మండలాల్లో ఉన్న పోడు రైతులకు పరిష్కారం దక్కనుంది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం అటవీ భూమి 2,14,700 ఎకరాలు ఉన్నది. పోడు పట్టాల కోసం 14వేల 50 దరఖాస్తులు రాగా 4,229 మందిని అర్హులుగా గుర్తించారు.ఇందులో8వేలఎకరాలకుపట్టాలను పంపిణీ చేయాల ని ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయం తీసుకున్నది. కామారెడ్డి జిల్లాలో అటవీ విస్తీర్ణం 2,04,727 ఎకరాలు ఉండగా 27,554 ఎకరాలు కబ్జాకు గురైంది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 4వేల మందికి పోడు పట్టా లిచ్చేందుకు నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

# అన్నివర్గాల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం మేలు: ఎమ్మెల్యే

నిజామాబాద్,జూన్26 : భావితరాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కులాలకు సంబంధించిన గురుకులాలు ఏర్పాటుచేసి ఆంగ్లమాధ్యమంలో నాణ్యమైన విద్య అందించటానికి కెసిఆర్ సర్కార్ శ్రీకారం చుట్టిందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణెశ్ అన్నారు. మైనార్టీ గురుకుల విద్యాలయాల ఏర్పాటుతో ఆ వర్గాలకు ప్రభుత్వ విద్యను చేరువ చేశామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ బంగారు తెలంగాణలో భాగ స్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే కులవృత్తులు కుటుంబాలు సంపన్నులుగా ఎదగాలనే లక్ష్యంతో కోట్లు ఖర్చు చేసి గొర్రెలు, రుణాలు అందిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. రైతులకు వచ్చే సంవత్సరం పంటలకు పెట్టుబడి అందించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు కేటాయించిందని చెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా పెట్టు బడిని ఆన్లైన్లో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 40 లక్షల మందికి ఆసరా, జీవనభృతి, గీతా కార్మికులకు ఫింఛన్లు అందిస్తుందని అన్నారు. రైతు ఆత్మహత్యల నివారణతో పాటు, కర్షకుల కుటుంబాల్లో వెలుగులు నింపి భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు అమలు చేస్తోందని అన్నారు.

# ధాన్యం దిగుబడి పెరిగింది

ఖమ్మం,జూన్26 : గత వేసవిలో సాగర్ జలాలు రైతులకు పుష్కలంగా అందటంతోపాటు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయడంతో అధిక విస్తీర్ణంలో, ఆశించిన పంట దిగుబడి సాధ్యపడిందని జిల్లా వ్యవసాయ అధికారులు అన్నారు. సరైనన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ద్వారా రైతులు పండించిన ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. ఈ సీజన్లో లక్ష్యాన్ని మించి ధాన్యం దిగుబడి సాధించడం జరిగిందని అన్నారు. అధిక దిగుబడికి పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. ఈ వ్యవసాయ సీజన్కు సంబంధించి తొలిసారిగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామని అన్నారు. సహకార సంఘాల వద్ద జీలుగు విత్తనాలు పొందాల్సిందిగా రైతులకు సూచించారు.

# కేంద్ర పథకాలపై బిజెపి ప్రచారం

మెదక్,జూన్26 : కేంద్ర ప్రభుత్వం తొమ్మిగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించేందుకు బిజెపి కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా నేతలు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలనలో ప్రజాసంక్షేమ పథకాలను అవలంబించి మంచి పాలన అందిస్తున్నారని అన్నారు.ప్రధాని మోడీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం 0సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ప్రజలకు సుపరిపాలన, పారదర్శకతకు పెద్దపీట వేశారన్నారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అనే నినాధంతో మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా ప్రధాని ఫసల్ బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, దీన్దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన, ప్రధానమంత్రి జీవన్జ్యోతి భీమా యోజన, అటల్ పింఛన్ యోజన, సుకన్య సమృద్ధి యో జన, ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన, ప్రధాని ము ద్రా యోజన, స్వచ్ఛభారత్ అభియాన్, బేటీ బచావో-బేటీ పడావో, ప్రధాని ఆవాస్ యోజన, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, జన్ధన్ యోజన పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు.

# హిమాచల్ను ముంచెత్తిన వరదలు

### అకస్మాత్తు వరదలతో చిక్కుకు పోయిన యాత్రికులు

సిమ్లా,జూన్26 : హిమాచల్ ప్రదేశ్ను భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. మండి జిల్లాలోని బగిపుల్ ప్రాంతంలో ప్రషార్ సరస్సు సమీపంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. వందల సంఖ్యలో స్థానికులు, యాత్రికులు మండి-ప్రషార్ రోడ్డులోని బగ్గీ వద్ద చిక్కుకుపోయారు. ఉత్తరాదిన కొండ ప్రాంతమైన హిమాచల్ ప్రదేశ్లో గత రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం బాగిపుల్ ప్రాంతంలో ఆకస్మాత్తుగా వరదలు ముంచెత్తాయి. భారీ వరదలతో ఇళ్లు,రోడ్లు, పరిసరప్రాంతాలు కొట్టుకుపోయాయి.ఆకస్మిక వరదల కారణంగా స్థానికులు, యాత్రికులు దాదాపు 200 మంది ప్రజలు వరదల్లో చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. హనోగీ మాతా ఆలయ సమీపంలోని మండి జాతీయ రహదారిపై ఆకస్మిక వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. మనాలి నేషనల్ హైవేపై కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మండి-కులుల మధ్య రోడ్డు బ్లాక్ కావడంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు 15 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. వందల సంఖ్యలో టూరిస్టులు, స్థానికులు ఎటూ కదలలేని పరిస్థితి. తినడానికి హోటళ్లు కూడా లేవు. కొండ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా వరదలు, కొండచరియలు విరిగిపడటంతో శనివారం సాయంత్రం హైవే బ్లాక్ చేయబడింది. రాబోయే రోజుల్లో మరింత భారీ వర్షాలు ఉన్నాయని స్థానిక వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది.

# వైఎస్సార్ లా నేస్తంతో యువ న్యాయవాదులకు ఆర్థిక చేయూత

- జిల్లాలో 182 మంది జానియర్న్యాయవాధులకు రూ. 44 లక్షల 60 వేల లబ్ది..
- జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు.

విజయవాడ,జూన్26 : వైఎస్సార్ లా నేస్తం జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక భరోసాగా నిలిచి న్యాయవాది వృత్తిలో స్థిరపడేందుకు ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి సోమవారం మూడవ విడత జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక చేయూతను అందించే వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని వర్చువల్ గా ప్రారంభించిన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా నుండి కలెక్టర్ కార్యాలయల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, శాసన సభ్యులు మల్లాది విష్ణు వర్ధన్, మాజీ మంత్రివర్యులు, శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీ శైలజ రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహంతి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు విజిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ లా నేస్తం పథకం అమలు తీరును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి వివరించారు. జిల్లాలో 182 మంది న్యాయవాదులు ఈ పథకం ద్వారా 44 లక్షల 60 వేల రూపాయల లబ్ది పొందుతున్నారని, వీరిలో 42 మంది షెడ్యూల్ కులానికి, 13 మంది షెడ్యూల్ తెగలకు చెందిన వారున్నారన్నారు. జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక తోడ్పాటును అందించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ఎంతో సహాయకారిగా ఉంటుందన్నారు. జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిలో ఎదగాలంటే ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఒడిదుడుకులు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా వారి ఆర్థిక అవసరాలు ముఖ్యంగా పుస్తకాలు, డ్రస్, రవాణా తదితర ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతున్నట్టుగా కొందరు యువ న్యాయవాదులు తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ పథకం " లా" చదవాలనుకున్న పేద విద్యార్థులకు ఆర్థిక భరోసాగా ఉంటుందని కలెక్టర్ డిల్లీరావు అన్నారు. జూనియర్ న్యాయవాది వీర్ల అరవింద్ ముఖ్యమంత్రితో మూఖాముఖి.

జూనియర్ న్యాయవాది వీర్ల అరవింద్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డితో మాట్లాడుతూ వైఎస్సార్ లా నేస్తం తాము వృత్తిలో ఎదిగేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

# తెలంగాణ నేపథ్యంలో రుద్రంగి



డీజే టిల్లు సినిమాతో టాలీవుడ్‌లో తెలంగాణ స్లాంగ్ కు క్రేజ్ పెరిగిపోయింది. అంతకు ముందు ఫిదా సినిమాలో హీరోయిన్ సాయిపల్లివి తెలంగాణ స్లాంగ్ తో అదరగొట్టింది. ఈ మధ్యకాలంలో వస్తున్న సినిమాలన్నీ.. తెలంగాణ డ్రాప్, తెలంగాణ స్లాంగ్ తో వస్తున్నవే. నాని దసరా, బలగం, దసరా, మేం ఫేమస్ వంటి సినిమాలు తెలంగాణ నేపథ్యంలో వచ్చి.. హిట్ కొట్టాయి. ప్రస్తుతం రాబోతున్న భగవంత్ కేసరి, భోళా శంకర్ సినిమాల్లో తెలంగాణ యాసని అనుకరిస్తూ ట్రైలర్ చూస్తే అర్థం అవుతుంది. ఇప్పుడు అదే తెలంగాణ నేపథ్యంలో మరో సినిమా రాబోతుంది. తెలంగాణ గడీల నేపథ్యంలో 1950 బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన చిత్రం రుద్రంగి. ఈ చిత్రానికి అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహించాడు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ అయి ఆకట్టుకుంటోంది. ఒక అప్పటి హీరోయిన్ మమతా మోహన్ దాస్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విలన్ గా జగపతిబాబు నటిస్తున్నాడు. ఈ సినిమా తెలంగాణ ప్రాంతంలో దొరల ఆకృత్యాలను, పరాజయాల కష్టాలను తెలుపుతూ సినిమా రూపొందించారు. రుద్రంగిలో భీంరావ్ దొర గా జగపతి బాబు విలన్ గా నటించాడు. ఈ సినిమాలో మమతా మోహన్ దాస్.. జ్వాలా బాయి దేశముఖ్ గా కనిపించింది. ఇక ఈ సినిమాలో ఆశిష్ గాంధీ హీరోగా నటించగా, విమలా రామన్, కాలకేయ ప్రభాకర్, గణవి లక్ష్మణ్ తదితరులు నటించారు. ట్రైలర్ చూస్తుంటే తెలంగాణ 1950 ల కాలానికి సంబంధించిన సినిమాగా తెలుస్తోంది. కానీ ట్రైలర్ కట్ లో ఇతర పాత్రల కంటే జగపతి బాబు పాత్ర పైనే ఎక్కువ ఫోకస్ చేశారు. ఓవరాల్ గా సినిమాలో యాక్షన్ సన్నివేశాలే ఎక్కువ ఉన్నట్లు ట్రైలర్ చూస్తే అర్థం అవుతుంది. ఇక ఈ సినిమాను రసమయి ఫిల్మ్స్ బ్యానర్ లో తెలంగాణ ప్రముఖ గేయ రచయిత రసమయి బాలకిషన్ నిర్మించాడు. ఇక రుద్రంగి సినిమాను అజయ్ సామ్రాట్ డైరెక్ట్ చేయగా, నౌఫాల్ రాజా మ్యూజిక్ అందించాడు. రుద్రంగి సినిమాను జులై 7వ తేదీన విడుదల కానుంది.

# ప్రభాస్ సినిమాలో స్టార్ నటులు

## అమితాబ్‌తో పాటు కమలహాసన్

కమలహాసన్ ఎలాంటి పాత్రను అయినా సరే తనదైన శైలిలో ప్రజెంట్ చేయగల అద్భుతమైన నటుడు అని అందరికీ తెలిసిందే. చాలా సినిమాల్లో కేవలం పాజిటివ్ రోల్స్ మాత్రమే కాకుండా పవర్‌ఫుల్ నెగటివ్ రోల్స్ కూడా చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఎక్కువగా అయితే తన సినిమాల్లోనే కమల్ హాసన్ హీరోగా చేస్తూనే మరోవైపు విలన్ పాత్రలు కూడా చేశాడు. దశావతారం అందుకు ప్రధాన ఉదాహరణ అని చెప్ప వచ్చు. ఇంకా ఆ తరహాలో నెగిటివ్ షేడ్స్ లో చేసిన పాత్రలో అయితే చాలానే ఉన్నాయి. అంతే కాకుండా భారతీయుడు లాంటి సినిమాల్లో మంచి కోసం ఆయన కన్న కొడుకుని చంపిన ఒక పాత్రలో ఊహించని షేడ్ చూపించాడు. ఏదేమైనా కూడా కమల్ హాసన్ అన్ని పాత్రలకు న్యాయం చేయగలడు అని దానికి తగ్గ ఎమోషన్ కూడా పండించగలరు అని నిరూపించాడు. అయితే ఇప్పుడు ప్రాజెక్ట్ ఐ సినిమా విషయానికి వస్తే అందులో ఒక పవర్ఫుల్ పాత్రలోనే కనిపించబోతున్నాను అని అర్థమవుతుంది. కమల్ హాసన్ తీసుకున్నారు అంటే అందులో నటనకు ప్రాధాన్యత ఉండటమే కాకుండా కథలో కూడా చాలా కీలకంగా ఉండే పాత్ర అని చెప్పవచ్చు. ఇక దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ కథలో కమల్ హాసన్ ను ఎలా చూపిస్తారు అనే విషయంలో ఇప్పుడు సర్వత్ర ఆసక్తి నెలకొంది. అయితే ఎప్పటిలానే ఈ పాత్ర పై కూడా సోషల్ మీడియాలో వివిధ రకాల గాసిప్స్ అయితే పుట్టుకొస్తున్నాయి. అమితాబచ్చన్ కూడా ఇందులో ప్రభాస్ కు ఒక మెంటర్ పాత్రలో చాలా పాజిటివ్ పాత్రలోనే కనిపించబోతున్నాడు. అయితే కథ ప్రకారం మొదట స్క్రీన్ ప్లే అమితాబ్ బచ్చన్ కమల్ హాసన్ తోనే కొనసాగుతుందట. ఒక అద్భుతమైన ఆవిష్కరణ జరిగినప్పుడు దాన్ని స్వార్థపూరితంగా ఉపయోగించే ప్రయత్నాలలో కమల్ హాసన్ ఉండగా..కుదరదు అని అమితాబచ్చన్ దాన్ని మంచి కోసం ఉపయోగించాలి అని ఆలోచనతో ఉంటారట. అయితే కమల్ హాసన్ చివరికి అద్భుతమైన టెక్నాలజీతో కూడిన ఆవిష్కరణను తన చేతుల్లోకి తీసుకొని దండయాత్ర స్టార్ట్ చేస్తాడట. ఇక అతనిని ఎదుర్కొనే ఆయుధంగా అమితాబ్ బచ్చన్ ప్రభాస్ ను రంగంలోకి దింపుతాడని ఒక టాక్ వస్తోంది. ఇక అతనికి మరో ఆయుధంగా దీపికా పదుకొనే కూడా ఉంటుందట. ఈ తరహాలో అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో కొన్ని గాసిప్స్ వైరల్ అవుతున్నాయి. మరి ఇది ఎంతవరకు నిజం అనేది సినిమా అప్డేట్స్ వచ్చేవరకు తెలియదు. కానీ కమల్ హాసన్ పాత్ర మాత్రం హై వోల్టేజ్ డోస్ తో ఉంటుంది అని తెలుస్తోంది. ఇక సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్న విషయం తెలిసిందే. ఒకవేళ అప్పుడు ఆలస్యం అయితే 2024 సమ్మర్లో రిలీజ్ చేయవచ్చు.



# దేవర సినిమాలో ఫైట్ సీన్లపై ప్రత్యేక దృష్టి




కొరటాల సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలు సైతం క్లాసిక్ గా ఉంటాయి. అతని స్టోరీలు ఎంత క్లాస్ గా ఉంటాయో! హీరోల్ని ఎంత క్లాస్ గా ప్రజెంట్ చేస్తాడో? యాక్షన్ సన్నివేశాల్ని కూడా అంతే క్లాస్ గా..క్లాసిక్ గా చూపించడం ఆయన ప్రత్యేకత. అతని యాక్షన్ శైలిలో ఓ ఇంటెన్స్ ఉంటుంది. స్టోరీని ఎక్కడా డీవియేట్ చేయకుండా! స్టోరీతో పాటే ఫైట్లు డిజైన్ చేయడం ఆయన ప్రత్యేకత. ఆయన శైలికి తగ్గ స్టంట్ మాస్టర్లని ఎంపిక చేసుకుని సినిమాని తనదైన మార్క్ లో చూపిస్తాడు. 'మిర్చి' నుంచి 'భరత్ అనే నేను' వరకూ కొరటాల సినిమాల్లో ÷ట్లు ఎంత ఇన్నోవేటివ్ ..క్లాస్ గా ఉంటాయో తెలిసిందే. 'జనతా గ్యారేజ్' లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ యాక్షన్ సన్నివేశాలు ఎంత ఇంటెన్స్ గా ఉంటాయో చూసాం. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్ కి ఆ రెట్లు మరింత వన్నె తీసుకొచ్చాయి. తాజాగా ఈ కాంబోలో 'దేవర' అనే మాస్ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన తారక్ ఫస్ట్ లుక్ పోస్టర్ లో మాస్ యాంగిల్ ఆకట్టుకుంటుంది. ఇందులో తారక్ జాలరి యువకుడి పాత్ర పోషిస్తున్నారు. ఆ పోస్టర్ లోనే కొరటాల మాసిజాన్ని ఓ రేంజ్ లో హీరోలో డిజైన్ చేసి వదిలాడు. ఇక ఈ సినిమాలో ఓ వాటర్ యాక్షన్ సీన్ ఉందని ..అది హైలైట్ అవుతుందని రెండు..మూడు నెలలుగా వినిపిస్తుంది. తాజాగా ఆ యాక్షన్ సన్నివేశాన్ని పూర్తిచేసారు. అయితే ఇది వాటర్ లో యాక్షన్ సీక్వెన్స్ అనడం తప్పు! ఆ ÷ట్ ఏ రేంజ్ లో ఉంటుందన్నది ఇంతవరకూ బయటకు రాలేదు. తాజాగా ఈ ÷ట్ కి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ లీక్ అందింది. ఇది సముద్రంలో యాక్షన్ సన్నివేశం అని తెలుస్తుంది. జాలరి పాత్ర కావడంతో ఈ ÷ట్ పూర్తిగా సముద్రంలో జరిగే యాక్షన్ సన్నివేశం అట. ఈ ÷ట్ ని చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇదొక బ్లూ మ్యాట్ సీన్. అచ్చంగా సముద్రాన్ని తలపిస్తుంది. అందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సముద్రమే కళ్ల ముందు ఉండేలా! ఓ వండర్ క్రియేట్ చేస్తారు. 'ఘాజీ'లో ఇలాంటి టెక్నాలజీ వినియోగించే సినిమా షూటింగ్ అంతా చేసారు. ఇప్పుడు దేవర లో యాక్షన్ సన్నివేశం కోసం అలాంటి అట్మాస్మియర్ క్రియేట్ చేసారు. ఈ ÷ట్ భారీ ఎత్తున చేసినట్లు తెలుస్తుంది. ఈ సీన్ కోసం వందల మంది ÷టైర్లని దించినట్లు సమాచారం. కొరటాల మార్క్ లో ఫైట్ హైలైట్ అవుతుందని సమాచారం. ఆ ఫైట్ కి ముందు ఫైటర్లు..ఎన్టీఆర్ మధ్య వచ్చే డైలాగులు పవర్ ఫుల్ గా ఉంటాయని..ముఖ్యంగా తారక్ జాలరి యాస్ మాస్ కి పీక్స్ లో కనెక్ట్ అవుతుందని అంటున్నారు. సినిమా మొత్తానికి ఈ ఫైట్ హైలైట్ గా ఉంటుందని..ఇది ఇంటర్వెల్ బ్యాంగ్ సీన్ అని వినిపిస్తుంది.

# డిఫరెంట్‌గా ...శ్రీసింహా భాగ్ సాలే

డిఫరెంట్ సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ముందు ఉన్న యువ హీరోల్లో శ్రీ సింహ కూడా ఒకరు. గతంలో మత్తు వదలరా, తెల్లారితే గురువారం, దొంగలున్నారు జాగ్రత్త వంటి సినిమాలతో ఆకట్టుకున్నాడు. తాజాగా ఆయన భాగ్ సాలే సినిమాతో ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయ్యాడు. ఫుల్ కామెడీ చిత్రంగా ఈ సినిమా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీకి ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ టీజర్ ని డిజె టిల్లు హీరో సిద్ధూ జొన్నలగడ్డ వాయిస్ ఓవర్ తో రిలీజ్ చేశారు. ఆయన సినిమా బ్యాగ్రౌండ్ కథను వినిపించారు. ఒక ఉంగరం చుట్టూ ఈ స్టోరీ తిరుగుతుంది అనే విషయం టీజర్ చూసినప్పుడే అర్థమైంది.కథ ఎక్కడ మొదలైంది అనే విషయాన్ని టీజర్ లో చూపించగా,అసలు కథను ట్రైలర్ లో చూపించారు. ఆ ఉంగరం సాధించడానికి ఎవరు ఏం చేశారు అనే విషయాన్ని ఆసక్తిగా చూపించారు. ట్రైలర్ విషయానికి వస్తే హీరో ఓ చిన్న ఫుడ్ బిజినెస్ నిర్వహిస్తూ ఉంటాడు. అయితే, హీరోయిన్ కి మాత్రం చాలా పెద్ద బిజినెస్ మ్యాన్ అని చెబుతూ ఉంటాడు. డైలాగ్స్ చాలా ఫన్నీగా ఉన్నాయి. ఉంగరం కోసం అటువైపు హీరో, హీరోయిన్లతో పాటు, విలన్ గ్యాంగ్ కూడా ప్రయత్నిస్తోంది. చివరకు ఎవరకు దక్కిందో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇప్పటి వరకు శ్రీసింహ డిఫరెంట్ జోనర్స్ ప్రయత్నించాడు. కానీ, మంచి హిట్ ఒక్కటి కూడా పడలేదు. దీంతో, ఆశలన్నీ ఈ సినిమాపైనే పెట్టుకున్నాడు. అయితే, ఈ జోనర్ మూవీ కూడా గతంలో కొందరు ప్రయత్నించారు.




మరి ఈ జోనర్ శ్రీసింహకు ఎంత వరకు ఉపయోగపడుతుందో తెలియాలంటే, మూవీ విడుదలయ్యే వరకు ఆగాల్సిందే. కాగా ఈ సినిమాలో శ్రీ సింహతో పాటు నేహా సోలంకీ, రాజీవ్ కనకాల, వైవా హర్ష, సత్య, సుదర్శన్, వర్షిణి తదితరులు నటించారు. ఈ సినిమాకు సంగీతం కాల భైరవ అందిస్తుండగా, ఎడిటింగ్ కార్తీక ఆర్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ రమేష్ కుషేందర్ చేస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం... ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపుకుంటోంది. ఇక సినిమాను జూలై 7న విడుదల చేయబోతున్నారు.

# ఆసియా క్రీడలకు జట్ల ఎంపికలో బిసిసిఐ

ముంబై,జూన్24 : సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు జరగనున్న ఆసియా క్రీడలకు మహిళలు, పురుషుల క్రికెట్ల జట్లను పంపించే ఆలోచనల్లో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. టీ20 ఫార్మాట్‌లో ఆ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. చైనాలోని హాంగ్‌జావూలో ఆసియా క్రీడలు జరగనున్నాయి. అయితే ఆ సమయంలో వరల్డ్‌కప్ ఉన్న నేపథ్యంలో ఆసియా క్రీడలకు పురుషుల బీ బృందాన్ని పంపాలని బీసీసీఐ భావిస్తోంది. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 23వ తేదీ వరకు వన్డే వరల్డ్‌కప్ జరగనున్న విషయం తెలిసిందే. ఆసియా క్రీడలకు ఏ గ్రేడ్ మహిళల క్రికెట్ జట్టును మాత్రం పంనున్నారు. జూన్ 30వ తేదీ లోగా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌కు క్రికెటర్ల జాబితాను బీసీసీఐ పంపనున్నది.

## సర్ఫరాజ్‌ను ఎంపిక చేయకపోవడంపై ఆగ్రహం

ముంబై,:భారత టెస్టు జట్టు ఎంపికపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఐపీఎల్‌లో రాణించిన వారిని సుదీర్ఘ ఫార్మాట్‌కు ఎంపిక చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను ఎప్పటిలాగే విస్మరించడంపై ఘాటుగా విమర్శిస్తున్నారు. కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తున్న అతడిని విండీస్ టూర్‌కు ఎంపిక చేస్తారని భావించారు. అయితే యశస్వీ, రుతురాజ్‌లను తీసుకున్న సెలెక్టర్లు సర్ఫరాజ్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో 'సర్ఫరాజ్ ఎక్కడ? ఏం జరుగుతోంది?' అని ప్రశ్నిస్తున్నారు.

## హాకీ వరల్డ్ కప్ హీరో రాజీవ్ మిశ్రా కన్నుమూత
## అనుమనాస్పద మృతిగా కేసు నమోదు

లక్నో,జూన్ : భారత జూనియర్ హాకీ వరల్డ్ కప్ హీరో రాజీవ్ మిశ్రాకన్నుమూశాడు. వారణాసిలోని తన సొంత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాజీవ్ రెండు మూడు రోజుల క్రితమే మరణించి ఉంటాడని స్థానికులు అంటున్నారు. అతను నివసిస్తున్న ఇంటిలోంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో, పోలీసులు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేశారు. రాజీవ్ అకాల మరణం భారత హాకీకి తీరని లోటు. అతనొక అద్భుతమైన నైపుణ్యం ఉన్న ప్రతిభావంతుడు' అని రాజీవ్ చిన్ననాటి కోచ్ ప్రేమ్ శంకర్ శుక్లాఅన్నాడు. రాజీవ్ మృతి పట్ల హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టర్కీ సంతాపం తెలియజేశాడు. 46 ఏళ్ల రాజీవ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఎసి పేలి ఇద్దరు మృతి

నల్లగొండ,జూన్26 : ఎసి పేలి ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం? నల్లగొండ జిల్లా కేంద్రంలో ఓ ఫ్రూట్స్ గోడౌన్‌లో ఎసి మిషిన్ రిపేర్ చేస్తుండగా ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో షేక్ ఖలీమ్, సాజిద్‌లు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. పేలుడు ధాటికి శరీర భాగాలు పది మీటర్ల దూరంలో పడిపోయాడు. మరో నలుగురు అక్కడి నుంచి భయంతో పరుగులు తీయడంతో ప్రాణాలు కాపాడుకున్నారు. ఎలా పేలింది అనే వివరాలు బయటకు రాలేదు.

## పీఎస్‌జీ క్లబ్‌తో రోజులు కష్టంగా గడిచాయి
### అర్జెంటీనా కెప్టెన్ లియోనల్ మెస్సీ

న్యూఢిల్లీ, : లెజెండరీ ఫుట్‌బాలర్, అర్జెంటీనా కెప్టెన్ లియోనల్ మెస్సీ వచ్చే సీజన్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడు. ఇంటర్ మియామి క్లబ్ తరఫున తొలి మ్యాచ్ ఆడేందుకు ఆతృతగా ఉన్నాడు. ఈమధ్యే పీఎస్‌జీను వీడిన ఈ స్టార్ ప్లేయర్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. పీఎస్‌జీ వాతావరణం లో ఇమడలేకపోయానని, పెద్ద సంఖ్యలో అభిమానులతో విభేదాలు చవిచూశానని మెస్సీ తెలిపాడు. పీఎస్‌జీ క్లబ్‌తో కొనసాగిన రోజులు కష్టంగా గడిచాయి. నాతో పాటు కుటుంబసభ్యులు కూడా అక్కడి వాతావరణానికి అలవాటు పడేందుకు ఇబ్బంది పడ్డారు. మరోవిషయం ఏంటంటే..? అక్కడివాళ్లు నన్ను ఓరకంగా చూసేవాళ్లు. అది నేను అస్సలు ఊహించలేదు' అని మెస్సీ వెల్లడించాడు. అంతేకాదు ఆ క్లబ్ ఫ్యాన్స్‌లో చాలామంది తనతో విభేదించేవాళ్లని ఈ వరల్డ్ కప్ హీరో అన్నాడు. ÷ఒట్‌బాల్ దిగ్గజాల్లో ఒకడైన మెస్సీ 2021లో పీఎస్‌జీతో రెండేళ్ల కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు. జూన్ 30న అతడు ఆ క్లబ్ తరఫున ఆఖరి మ్యాచ్ ఆడేశాడు. ఆ క్లబ్ తరఫున మెస్సీ 28 గోల్స్ చేశాడు.

# పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం

### 30న రాష్ట్రవ్యాప్తంగా పోడు భూములకు పట్టాలు
### ఇక అడవుల రక్షణకు మరిన్ని కఠిన చర్యలు

ఆదిలాబాద్,జూన్ 26 : పోడును నమ్ముకొని బతుకీడుస్తున్న గిరిజనులకు దశాబ్దాల నుంచి వేధిస్తున్న పోడు భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం దక్కనుంది. దీంతో ఇక భవిష్యత్‌లో మళ్లీ పోడు సమస్య లేకుండా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతున్నది. పోడుకు పట్టాలు పంపిణీ చేసిన తర్వాత రక్షిత, రిజర్వ్ అటవీ భూముల్లో మానవ ప్రమేయాన్ని పూర్తిగా నిషేధించి పర్యావరణ పరిరక్షణేలి ధ్యేయంగా సర్కారు పని చేయనున్నది. అటవీ భూములను ఆక్రమించిన వారు గిరిజనులే అయితే 2006కు ముందు నుంచి సాగులో ఉండాలి.హక్కు పత్రాల జారీకి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దశాబ్ది వేడుకల్లోనే పంపిణీకి నిర్ణయించినప్పటికీ సాంకేతిక కారణాలతో ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు పట్టాల పంపిణీకి ముహూర్తాన్ని ఖరారు చేశారు. జూన్ 30న రాష్ట్రవ్యాప్తంగా పోడు భూములకు చెందిన పట్టాలను పంపిణీ చేయాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు అర్హులైన వారికి పట్టాలను అందిస్తారు. పోడు సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపడంతోపాటు ఇకపై అటవీ భూముల ఆక్రమణను పూర్తిగా నిలువరించడమే ధ్యేయంగా తెలంగాణ సర్కారు కీలకమైన నిర్ణయాలను తీసుకుంటున్నది. అలాగే వారి ఆర్థిక స్థితిగతుల వివరాలను ప్రభుత్వం పరిశీలన చేసింది. పదెకరాల లోపు కబ్జాలో ఉండి ఆ భూమినే జీవనాధారంగా ఉంటే ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందేందుకు అర్హులు. ఇందుకోసం గతేడాది అర్హులైన వారి క్లెయిమ్స్ స్వీకరించారు. సాగు చేసుకుంటున్న వారు ఆధారాలతో ఎఫ్‌డీవో స్థాయి అధికారులకు దరఖాస్తులు అందించారు. గ్రామ, డివిజనల్ కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సిఫార్సు చేయగా జిల్లా కమిటీ అర్హులను ఎంపిక చేసింది. గిరిజనేతరులైతే ఆ కుటుంబం నుంచి మూడు తరాలవారు ఆ భూమిలో సాగు చేసుకుంటున్నట్లు ఆధారాలుండాలి. అటవీ భూముల్లో సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారు ఎంతమంది అన్నది లెక్కలు తీసారు. ఇకముందు అడవుల పరిరక్షణలో అవసరమైన చోట పోలీసుల సహకారంతో ఇకపై అటవీ శాఖ కఠిన చర్యలకు సిద్ధం కాబోతున్నది. అటవీ ప్రాంతంలో ఏ ఒక్క చెట్టును నరికినా బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక నుంచి అడవి, అటవీ భూముల్ని కాపాడు కోవడానికి అంకితభావం, చిత్తశుద్ధితో కృషి చేసేందుకు అటవీ శాఖ పని చేయబోతున్నది. ఫారెస్ట్ రేంజ్‌ల వారీగా అటవీ విస్తీర్ణం, ఫారెస్ట్ బీట్లు, సిబ్బంది సంఖ్యాపరంగా విధులను వర్గీకరించి నిఘాను కట్టుదిట్టం చేయనున్నది. ఇంటిదొంగల భరతం పట్టడంతోపాటు అక్రమంగా అడవుల్లో కాలు మోపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే పరిస్థితి ఉండబోదని ప్రభుత్వం స్పష్టం చేసిన దరిమిలా కలప స్మగ్లర్లను కటకటాలకు పంపేందుకు సిద్ధం అవుతున్నది. హరితహారం కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం 2015 నుంచి కృషి చేస్తున్నది. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా అటవీ విస్తీర్ణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్న నేపథ్యంలో అటవీ శాఖ పనితీరు ఇకపై కీలకంగా మారనున్నది. అడవుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ భావించేలా ప్రజల్లో అవగాహనను పెంపొందించనున్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాలకు లోబడి అటవీ భూముల్లో వ్యవసాయం చేసుకొని బతుకుతున్న పేదవారికి ఆఖరి అవకాశంగా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. పోడు భూముల సమస్య అనేక ఏండ్ల నుంచి జఠిలంగా పడి ఉన్నది. తెలంగాణ సిద్ధించిన తర్వాత హక్కులను ప్రసాదిస్తామని కేసీఆర్ స్పష్టమైన హామీ ఇచ్చారు. తదనుగుణంగా తెలంగాణ వ్యాప్తంగా పోడు భూములపై రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్త సర్వేలు నిర్వహించాయి. పారదర్శకంగా చేపట్టిన ఈ సర్వేలో ఎవరు కబ్జాకోరులు, ఎవరు అసలైన పోడు వ్యవసాయదారులో తేల్చారు. అటవీ ఆక్రమణదారులపై కఠినంగా వ్యవహరిస్తూనే పేద ప్రజలకు మేలు చేసేందుకు తెలంగాణ సర్కారు కీలక నిర్ణయం తీసుకోబోతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. పోడు సమస్యను గతంలోని కాంగ్రెస్ పార్టీ కనీసం పట్టించుకోలేదు.

రాజకీయ ఆక్రమణదారులతో చేతులు కలిపి ఏకంగా అడవులను భక్షించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ మాత్రం అడవులను కాపాడు తున్నారు. కబ్జాలను నిరోధిస్తున్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వడం ద్వారా వేలాది కుటుంబాల్లో భరోసా నింపబోతున్నారు.



# విసిలతో గవర్నర్ తమిళిసై సమావేశం..!

హైదరాబాద్ జూన్ 26 (ప్రజా మంటలు) : రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సమావేశమ య్యారు. రాజ్‌భవన్‌లో ఈ సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ వైస్ చాన్సలర్లతో పాటు యుజిసి అధికారులను మాత్రమే పిలిచినట్టుగా తెలుస్తోంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు గవర్నర్ నుంచి ఆహ్వానం అందలేదని సమాచారం. ఇక, ఈ సమావేశం సందర్భంగా గవర్నర్ తమిళిసై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల అభివృద్దే ప్రధాన లక్ష్యమని చెప్పారు.



దేశాభివృద్ధికి ఉన్న విద్య అనేది ఒక పిల్లర్ అని అన్నారు. రాజ్‌భవన్‌లో డిజిటల్ లైబ్రరీలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఉన్న సమస్యలతో విద్యార్థులతో ఇంటరాక్ట్ కాలేకపోతున్నానన్నారు. యూనివర్సిటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపైఆరాతీశారు. విద్యార్థులు ఆత్మహత్యలపై అంతా ఆలోచించాలన్నారు. మంచి ప్రొఫెసర్లు, ట్యాలెంటెడ్ స్టూడెంట్స్ ఉన్నా ర్యాకింగ్స్‌లో వెనకబడుతున్నామని అన్నారు. విద్యార్థులను జాబ్ సీకర్స్‌గా కాకుండా జాబ్ క్రియేటర్స్‌గా యూనివర్సిటీలు తీర్చిదిద్దాలని చెప్పారు. ఇది ఓపెన్ మీటింగ్ అని ఏ విషయమైనా తనతో చెప్పొచ్చన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092,PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com